కేజీహెచ్‌లో క్యాన్సర్‌కు అత్యాధునిక వైద్యం

ఆధునిక నూతన పరికరాలు రావడంతో రోగులకు ఎంతో మేలు

- రూ.45 కోట్లతో సిటీ సిములేటర్, లీనియర్ యాక్సిలిరేటర్, హెచ్‌డీ బ్రాకీ థెరపీ పరికరాలను సమకూర్చిన రాష్ట్ర ప్రభుత్వం
- నేరుగా క్యాన్సర్ కణాలకు చికిత్స అందించే టెక్నాలజీ అందుబాటులోకి..

- 8లో

సర్పంచ్ సంవాద్ సదస్సుకు లక్ష్మీ ప్రసన్న

- కొత్తూరు సర్పంచ్‌కు అరుదైన అవకాశం

కొత్తూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి):
నేషనల్ క్వాలిటీ కాంక్లేవ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 15న ఢిల్లీలో జరగనున్న సదస్సుకు అనకాపల్లి మండలం కొత్తూరు మేజర్ పంచాయతీ సర్పంచ్ సప్పారపు లక్ష్మీ ప్రసన్నకు ఆహ్వానం అందింది. జలశక్తి మంత్రిత్వ శాఖలోని తాగునీరు, పారిశుధ్యం విభాగంలో క్వాలిటీ కౌన్సిల్ ఈ సదస్సు నిర్వహించనుంది. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి సుమారు 75 మంది సర్పంచులను ఎంపిక చేయగా, వీరిలో ఆంధ్రప్రదేశ్ నుంచి ఆరుగురు సర్పంచులకు ఆహ్వానం అందింది. వారంతా ఆదివారం ఢిల్లీ బయలుదేరనున్నారు. సర్పంచ్ సంవాద్ యాప్‌లో దేశంలోని సర్పంచులు ఎప్పటికప్పుడు పంచాయతీలో చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల ఫొటోలు, వీడియోలను అప్‌లోడ్ చేశారు. రెండు లక్షల మంది సర్పంచులకు ఈ యాప్‌ను అనుసంధానం చేయాలని క్వాలిటీ కంట్రోల్ అధికారులకు ఆదేశాలు వచ్చాయి. ఈ క్రమంలో 75 మంది సర్పంచులను జాతీయ స్థాయిలో గుర్తించి వారిని ఆహ్వానించారు. సదస్సుకు కేంద్ర జల వనరుల శాఖా మంత్రి సి.ఆర్.పాటిల్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. గ్రామీణాభివృద్ధికి కేంద్ర నిధులు ఏ విధంగా ఉపయోగపడుతున్నాయో, గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం సమస్యలు ఏ విధంగా అధిగమించాలో ఈ సదస్సులో అభిప్రాయాలు తెలియజేయనున్నారు.

ఆనందంగా ఉంది



జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం ఆనందంగా ఉంది. ప్రభుత్వం ఈ విధంగా ప్రోత్సహిస్తే మరింత అభివృద్ధి దిశగా పంచాయతీని తీసుకువెళ్లేందుకు కృషి చేస్తాం. కొత్తూరు పంచాయతీ ప్రజల సహకారం వలనే జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది.
- సప్పారపు లక్ష్మీప్రసన్న

నేడు బీజేపీ సభ

- ముఖ్య అతిథిగా పార్టీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా హాజరు

విశాఖపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి):
భారతీయ జనతా పార్టీ ఆదివారం నగరంలోని రైల్వే మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహించనుంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ 'సారథ్యం' పేరుతో చేపట్టిన యాత్రకు ఇది ముగింపు సభ. దీనికి పార్టీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా హాజరవుతున్నారు. శనివారం రాత్రి ఆయన నగరానికి చేరుకున్నారు. మొత్తం రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ సభకు తరలివస్తున్నారు. కార్యకర్తలు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని, కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ... మిగతా 8వ పేజీలో



విమానాశ్రయంలో బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డాకు స్వాగతం పలుకుతున్న పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి సత్యకుమార్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, తదితరులు

ప్రగతికి బాటలు

అనకాపల్లి నుంచి దివాన్‌చెరువు వరకు ఆరు లైన్ల జాతీయ రహదారి విస్తరణకు వేగంగా అడుగులు

- తుది దశకు డీపీఆర్
- టెండర్ల ప్రక్రియ చేపట్టేందుకు సన్నద్ధం



అనకాపల్లి నుంచి అన్నవరం- దివాన్‌చెరువు వరకు జాతీయ రహదారి విస్తరణ పనులు ప్రారంభమయ్యేది ఇక్కడ నుంచే..

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)
అనకాపల్లి నుంచి అన్నవరం మీదుగా దివాన్ చెరువు వరకు జాతీయ రహదారిని ఆరు లైన్లుగా విస్తరించేందుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. జిల్లా పరిధిలో 64.645 కిలోమీటర్ల వరకు విస్తరణ పనులు చేపట్టనున్నారు. దీనికి కేంద్ర ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. ప్రస్తుతం డీపీఆర్ తుది దశకు చేరుకోగా, టెండర్ల ప్రక్రియ చేపట్టేందుకు ఎన్‌హెచ్‌ఏఐ సిద్ధమవుతోంది.

ఈ జాతీయ రహదారిని 2004లో నాలుగు లైన్ల రహదారిగా అప్పటి ప్రధాని వాజ్‌పేయి ఆధ్వర్యంలో అభివృద్ధి చేశారు. వాస్తవానికి శ్రీకాకుళం నుంచి ఆనందపురం వరకు మాత్రమే ఆరు లైన్ల జాతీయ రహదారి ప్రస్తుతం ఉంది. మిగిలిన రహదారి నాలుగు లైన్లగానే ఉంది. ప్రస్తుతం పెరిగిన ట్రాఫిక్, అంతర్రాష్ట్ర రవాణా వ్యవస్థ అభివృద్ధిని పరిగణనలోకి తీసుకొని దేశవ్యాప్తంగా జాతీయ రహదారులను విస్తరించేందుకు నిర్ణయించారు. ఇందులో భాగంగా అనకాపల్లి నుంచి అన్న వరం మీదుగా దివాన్‌చెరువు వరకు జాతీయ రహదారిని మళ్లీ ఎన్‌డీఏ ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో ఆరు లైన్ల రహదారిగా విస్తరణ జరిపేందుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. ఈ రహదారి అభివృద్ధికి గత ఏడాది డిసెంబరు నెలలో డీపీఆర్ రూపకల్పన కోసం టెండర్లు పిలిచారు. ఇప్పటికే అనకాపల్లి నుంచి అన్నవరం మీదుగా దివాన్ చెరువు వరకు ఆరు లైన్లుగా విస్తరణకు అవసరమయ్యే భూమి, అండర్ పాత్‌వేలు, వంతెనలు, సర్వీస్ రోడ్ల నిర్మాణ వివరాలు సేకరిస్తున్నారు. ఈ ప్రక్రియ తుది దశకు చేరడంతో త్వరలోనే పనులు ప్రారంభించేందుకు టెండర్ల ప్రక్రియను జరిపేందుకు ఎన్‌హెచ్‌ఏఐ సిద్ధమవుతోంది. విస్తరణ పనులు జిల్లాలో అనకాపల్లి డైట్ కాలేజీ నుంచి ప్రారంభమై కశింకోట, ఎలమంచిలి, ఎస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట ... మిగతా 8వ పేజీలో

19న డీఎస్సీ అభ్యర్థులకు నియామక పత్రాలు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్‌ల చేతుల మీదుగా అందజేత

- వెలగపూడిలో సచివాలయం సమీపాన అభినందన సభ
- ఉత్తరాంధ్రలో గల 2,660 అభ్యర్థుల కోసం 118 బస్సులు ఏర్పాటు
- ఆ కార్యక్రమం ముగిసిన అనంతరం అభ్యర్థులకు పది రోజులపాటు శిక్షణ

విశాఖపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి):
మెగా డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 19వ తేదీన అమరావతిలో నియామక పత్రాలు అందజేస్తారు. ఇందుకోసం వెలగపూడిలో సచివాలయం వెనుక అభినందన సభ ఏర్పాటుకు విద్యా శాఖ సన్నాహాలు చేస్తోంది. ఉత్తరాంధ్రలో 2,660 మందికి నియామక పత్రాలు అందజేస్తారు. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల్లో స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీ, గురుకులాలు/మోడల్ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, టీజీటీ, పీజీటీ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు తోడుగా కుటుంబ సభ్యుల్లో ఒకరిని అభినందన సభకు అనుమతిస్తారు. ఉత్తరాంధ్ర నుంచి అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులను తీసుకువెళ్లడానికి సుమారు 120 బస్సులు ఏర్పాటుచేస్తున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం నుంచి ఈనెల 18వ తేదీ ఉదయం బస్సులు బయలుదేరతాయి. ఆరోజు రాత్రికి విజయవాడ సమీపంలో వారికి వసతి ఏర్పాటుచేస్తారు. 19వ తేదీ ఉదయం అభినందన సభలో జిల్లాల నుంచి ఎంపిక చేసిన కొద్దిమందికి సీఎం నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్, ఇతర ప్రముఖులు నియామక పత్రాలు అందజేస్తారు. మిగిలిన వారికి అదే ప్రాంగణంలో ఏర్పాటుచేసే కౌంటర్ల ద్వారా పత్రాలు ఇవ్వనున్నారు. అభినందన సభ ముగిసిన తరువాత తిరిగి అవే బస్సుల్లో జిల్లాలకు తీసుకువస్తారు. ఆ తరువాత ఎంపికైన అభ్యర్థులకు పాఠశాలల నిర్వహణ, బోధన, పరిపాలన, ఇతర అంశాలపై జిల్లాల వారీగా పది రోజులపాటు శిక్షణ ఇస్తారు. ఇప్పటివరకూ డీఎస్సీ ద్వారా ఎంపికైన టీచర్లను కౌన్సెలింగ్‌లోనే పాఠశాలలు కేటాయించేవారు. ఈ పర్యాయం పది రోజుల శిక్షణ ఇచ్చిన తరువాత పాఠశాలలకు పంపాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి ఉద్యోగికి శిక్షణ అవసరమని విద్యా శాఖ అధికారి ఒకరు తెలిపారు. దసరా సెలవులు తరువాత కొత్త టీచర్లకు పాఠశాలలు కేటాయించనున్నట్టు పేర్కొన్నారు.



అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న దృశ్యం (ఫైల్)



నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కొణతాల

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి):
స్థానిక మెయిన్‌రోడ్డులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ప్రారంభించి ఇంటర్వ్యూల్లో ఎంపికైన వారికి ఆయా కంపెనీల నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడు నెలల క్రితం నిర్వహించిన జాబ్‌మేళాలో 106 మంది అభ్యర్థులు ఉద్యోగాలు పొందారన్నారు. ఈ దఫా 30 కంపెనీల వరకు ఈ జాబ్‌మేళాలో పాల్గొన్నాయన్నారు. ఈ జాబ్‌మేళాలో పదవ తరగతి నుంచి ఇంజనీరింగ్, గ్రాడ్యుయేషన్ చేసిన వారు పాల్గొన్నారన్నారు. 1,560 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా, వీరిలో 587 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఎస్.గోవిందరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ సబ్బవరపు గణేశ్, నూకాంబిక ఆలయ మాజీ ఛైర్మన్లు పీలా నాగశ్రీను, బీఎస్ఎంకే జోగినాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సాగునీటి కాలువలకు మోక్షం

- శిథిలమైన మదుములు, తలుపుల స్థానంలో కొత్తవి ఏర్పాటు
- కాలువల్లో పూడికతీత
- గత వైసీపీ ప్రభుత్వంలో పూర్తిగా నిర్లక్ష్యం
- ఒక్క ఏడాది కూడా నిధులు మంజూరు చేయని దుస్థితి
- తాజాగా పొలాలకు నీరందుతుండడంతో రైతుల ఆనందం

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మహర్దశ





మంగవరం వద్ద కాలువపై నిర్మించిన మదుములు, ఏర్పాటు చేసిన తలుపులు (ఇన్‌సెట్‌లో) కొత్త మదుములు నిర్మించక ముందు ఇలా..(ఫైల్)

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి):
మండలంలోని సాగునీటి కాలువలకు ఎన్నో ఏళ్ల తరువాత మోక్షం కలిగింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వీటికి మహర్దశ పట్టింది. శిథిలమై కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న మదుములు, విరిగిపోయిన తలుపులను తాజాగా తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశారు.

గత వైసీపీ ప్రభుత్వంలో శిథిలమైన మదుములను పునర్నిర్మించాలని, విరిగిపోయిన తలుపుల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని సాగునీటి శాఖాధికారులకు, నాయకులకు ఎన్నిసార్లు రైతులు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. కనీసం ఒక్క ఏడాది కూడా నిధులు మంజూరు చేయలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించడం, రాష్ట్ర హోం మంత్రి రైతుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ నుంచి మొదటి విడతగా సుమారు 36 లక్షల రూపాయలను మంజూరు చేయడంతో సాగునీటి కాలువలపై మదుములు నిర్మించారు. తరువాత సాగునీటి సంఘాలకు నిధులు విడుదల కావడంతో సాగునీటి కాలువల్లో దశాబ్దాల తరబడి పేరుకుపోయిన పూడికను ఎక్స్‌కవేటర్లతో తొలగించారు. సాగునీటి కాలువల ద్వారా ఎటువంటి ఆటంకం లేకుండా సాగునీరు పొలాలకు చేరుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మంగవరం, గుంటపల్లి కాలువలలో మదుములు, తలుపులు పూర్తిగా శిథిలం కావడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. మంగవరం వద్ద మెరక కాలువ, పల్లం కాలువ, కొముదుల కాలువ, చెరువు కాలువలుగా విడిపోయి సుమారు 500 ఎకరాలకు నీరు చేరుతుంది. చాలా సంవత్సరాలుగా ఈ నాలుగు కాలువల మదుములు, తలుపులు ధ్వంసం కావడంతో పొలాలకు నీరు పెట్టడానికి రైతులు నానా అవస్థలు పడేవారు. గత వైసీపీ ప్రభుత్వంలో వీటి ... మిగతా 8వ పేజీలో



రైతు సేవా కేంద్రం వద్ద రైతులు

యూరియా కోసం పడిగాపులు

చీడికాడ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి):
మండల కేంద్రం చీడికాడ రైతు సేవా కేంద్రం వద్ద యూరియా కోసం శనివారం ఉదయం నుంచి రైతులు పడిగాపులు కాశారు. ఉదయం 6 గంటలకు రైతులు కేంద్రానికి రాగా, ఉదయం 8 గంటలకు అధికారులు వచ్చి డాక్యుమెంట్లు తయారుచేసి రైతుల నుంచి నగదు తీసుకొని రశీదు అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారిణి ఎ.కృష్ణవేణి మాట్లాడుతూ ప్రస్తుతం ఈ కేంద్రానికి 278 యూరియా బస్తాలు వచ్చాయని, ఒక్కో రైతుకు ఒక్కో బస్తా పంపిణీ చేస్తామని, ఇచ్చిన రశీదుల మేరకు సోమవారం కూడా యూరియా సరఫరా చేస్తామని తెలిపారు. అంతకు ముందు యూరియా కోసం రైతుల మధ్య తోపులాట జరిగింది.

ఇద్దరు హెచ్‌ఎంలకు షోకాజ్ నోటీసులు

- జెండా వందనం నాడు నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు చర్యలు

గొలుగొండ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి):
మండలంలోని సాలికమల్లవరం, సీహెచ్ నాగాపురం పాఠశాలల్లో ఆగస్టు 15న జెండా వందనం కార్యక్రమంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు ప్రధానోపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని ఇన్‌చార్జి ఎంఈవో ఓ.సత్యనారాయణ శనివారం తెలిపారు. సాలికమల్లవరం పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్ జొన్న లోవ, సీహెచ్ నాగాపురం కమిటీ ఛైర్మన్ జైతు అప్పారావు పిల్లలు ఆయా పాఠశాలల నుంచి టీసీ తీసుకుని ఇతర పాఠశాలల్లో చేరిపోయారు. కానీ ఈ విషయాన్ని ప్రధానోపాధ్యాయులు ఎంఈవో దృష్టికి తీసుకువెళ్లకుండా నిర్లక్ష్యం వహించారు. అంతే కాకుండా ఆయా పాఠశాలల కమిటీ ఛైర్మన్లతోనే ఆగస్టు 15న పాఠశాలలో జెండా వందనం చేయించారు. దీనిపై స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ జరిపిన ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సాలికమల్లవరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సునీల్‌కుమార్, సీహెచ్. నాగాపురం ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావుకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్టు ఎంఈవో తెలిపారు.

దారి ఘోరం.. ప్రయాణం దుర్లభం

- గోతులమయంగా పినగాడి- కె.కోటపాడు రోడ్డు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనచోదకులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



పినగాడి- కోటపాడు మార్గంలో పినగాడి జంక్షన్ సమీపంలో గోతులమయంగా రోడ్డు



పినగాడి- కోటపాడు రోడ్డులో మలునాయుడుపాలెం వద్ద ఇలా..

సబ్బవరం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి):
మండలంలోని పినగాడి- కె.కోటపాడు రోడ్డు పలు చోట్ల గోతులమయంగా ఉంది. ఏడాదిగా ఈ రోడ్డు అధ్వానంగా తయారుకావడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిపై ప్రజాప్రతినిధులు, అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పినగాడి జంక్షన్ సమీపంలో కోటపాడు వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా ఇటీవల భారీ నిర్మాణాలు జరిగాయి. ఈ నేపథ్యంలో ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న గెడ్డలను వ్యాపారులు పూడ్చేశారు. గెడ్డలు పూడ్చేయడమే కాకుండా రోడ్డుకు ఇరువైపులా మట్టితో కప్పేసి కాంక్రీటు తాపడాలతో ఎత్తు చేయడంతో పినగాడి జంక్షన్ నుంచి ... మిగతా 8వ పేజీలో

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

- రికార్డులు, నిల్వల పరిశీలన



ఎలమంచిలిలోని ఎరువుల దుకాణంలో స్టాకును పరిశీలిస్తున్న అధికారులు

ఎలమంచిలి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి):
పట్టణంలో శనివారం ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. స్థానిక వ్యవసాయాధికారి మోహనరావుతో కలిసి విజిలెన్స్ ఎస్ఐ రవికుమార్, సిబ్బంది దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. యూరియా, ఇతర ఎరువుల స్టాక్ లభ్యత రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలు, గొడౌన్‌లోని ఎరువుల నిల్వలను పరిశీలించినట్టు వ్యవసాయాధికారి మోహనరావు తెలిపారు. పట్టణంలోని మన గ్రోమోర్ సెంటర్‌లో కాంప్లెక్సు ఎరువులను తనిఖీ చేసి రికార్డులు, సరుకుకు వ్యత్యాసం ఉండడంతో 19 మెట్రిక్ టన్నుల ఎరువులకు స్టాప్ సేల్ ఇచ్చినట్టు తెలిపారు. అదే విధంగా గాయత్రి రైతు డిపో, శ్రీవేంకటేశ్వర రైతు డిపోలో తనిఖీలు చేశారు.

హెటెరో కెమికల్ భవనాన్ని ఆపండి

▸ హోం మంత్రికి ఎంపీటీసీ సభ్యుడు ఆకేటి ఫిర్యాదు



విజయవాడలో హోంమంత్రి అనితకు వినతిపత్రాన్ని ఇస్తున్న ఎంపీటీసీ సభ్యుడు ఆకేటి గోవిందరావు

నక్కపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని న్యాయంపూడి గ్రామ రెవెన్యూ పరిధిలో హెటెరో ఔషధ పరిశ్రమ యాజమాన్యం నిర్మిస్తున్న కెమికల్ భవనాన్ని (గ్యాస్ గొడౌన్) నిలుపుదల చేయాలని కాగిత ఎంపీటీసీ సభ్యుడు ఆకేటి గోవిందరావు హోం మంత్రి అనితకు ఫిర్యాదు చేశారు. శనివారం విజయవాడలో హోం మంత్రి అనితను ఆకేటి గోవిందరావు కలిసి హెటెరో యాజమాన్యం నిర్మిస్తున్న కెమికల్ భవనం వల్ల భవిష్యత్‌లో ఈ ప్రాంత ప్రజలకు కలిగే అనర్థాల గురించి వివరించారు. కాగిత, న్యాయంపూడి, వెదుళ్లపాలెం గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడతారని చెప్పారు. హోం మంత్రి అనిత ఎంతో సానుకూలంగా స్పందించారని, ఈ భవన నిర్మాణ పనులను ఆపాలని అధికారులను ఆదేశించారని ఆకేటి గోవిందరావు చెప్పారు.

ప్రగడను సత్కరించిన ఎరిపిల్లి



ప్రగడను సత్కరించిన రాంబిల్లి సొసైటీ చైర్‌పర్సన్ ఎరిపల్లి చిట్టిబాబు

రాంబిల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాంబిల్లి సొసైటీ చైర్‌పర్సన్‌గా నియమితులైన లోవపాలెంకు చెందిన ఎరిపిల్లి చిట్టిబాబు శనివారం రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావును సత్కరించారు. శనివారం అచ్యుతాపురంలోని ప్రగడ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ప్రగడ నాగేశ్వరరావును చిట్టిబాబు, టీడీపీ నాయకులు శాలువ కప్పి పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రగడ మాట్లాడుతూ రాంబిల్లి సొసైటీని అభివృద్ధి పథంలో నడిపించాలని చిట్టిబాబుకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎలమంచిలి మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోవింద్, టీడీపీ నాయకులు చెల్లూరి ఆనంద్, రాముడు, అండిబోయిన బాబూరావు, బుజ్జి, జగ్గారావు, వెంకటరావు, ఎరుపల్లి నాగరాజు, చేపల చిట్టిబాబు, సత్తిబాబు పాల్గొన్నారు.

16 నుంచి మునగపాకలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

మునగపాక, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు జరగనున్నాయని జూనియర్ హైటెక్ సభ్యులు తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం కబడ్డీ పోటీల ప్రచార కరపత్రాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు పెంటకోట విజయ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఆడారి వెంకటేష్, దొడ్డి సాయి, టెక్కలి శివగణేష్, కర్రి శివ, హైటెక్ సభ్యులు పాల్గొన్నారు.

'పేదలు బాగుండాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యం'



కొత్తపోలవరంలో అప్పలరాజుకు చెక్కు అందజేస్తున్న వెంకటరాజు

ఎస్.రాయవరం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలందరూ బాగుండాలన్నదే ప్రధాన లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన కొనసాగిస్తున్నారని టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు ఎస్.వెంకటరాజు అన్నారు. మండలంలోని గుడివాడ పంచాయతీ శివారు కొత్తపోలవరానికి చెందిన టీడీపీ కార్యకర్త గుడిమెట్ల అప్పలరాజు అనారోగ్యానికి గురి కావడంతో అతనికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.లక్ష హామీ పత్రాన్ని వెంకటరాజు శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాకలపాటి గణపతిరాజు, పాలవలస సత్యానారాయణ, అలమండ వెంకటరమణ, పాకలపాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు : సీఐ

ఎస్.రాయవరం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న దుకాణదారులెవరైనా రోడ్డుపైకి వచ్చి వ్యాపారాలు చేస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని నక్కపల్లి రూరల్ సర్కిల్ సీఐ ఎల్. రామకృష్ణ హెచ్చరించారు. శనివారం అడ్డరోడ్డు జంక్షన్‌లో రేవుపోలవరం వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న వ్యాపారస్తులతో ఆయన వ్యాపారస్తులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వ్యాపారులంతా రోడ్డు పైకి వచ్చి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించరాదన్నారు. అలా కాకుండా నిబంధనలు అతిక్రమించి ఎవరైనా ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగేలా వ్యాపారాలు చేసినట్టయితే చర్యలు తప్పవని రామకృష్ణ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ విభీషణరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుందరపును కలిసిన ఏపీటీఎఫ్ నేతలు



ఎమ్మెల్యేను కలిసి సమస్యను వివరిస్తున్న ఏపీటీఎఫ్ నేతలు

ఎలమంచిలి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ నేతలు శనివారం ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్టు సంఘ ప్రతినిధి సత్యానారాయణ తెలిపారు. రాష్ట్ర కౌన్సిలర్ కె.శ్రీనివాసరావు, చంద్రశేఖర్ తదితరులు ఎమ్మెల్యేను కలిసి విద్యా రంగ సమస్యలు, ఉపాధ్యాయుల బకాయిలు, సీపీఎస్ రద్దు, తదితర సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో త్రినాధస్వామి, కన్నం శ్రీను, ముత్తా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నక్కపల్లిలో..

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించడంలో హోం మంత్రి అనిత చొరవ చూపాలని ఏపీటీఎఫ్ ప్రతినిధులు కోరారు. ఏపీటీఎఫ్ నిరసన వారంలో భాగంగా శనివారం స్థానికంగా వున్న హోం మంత్రి క్యాంపు కార్యాలయానికి వెళ్లి, సమస్యలపై అక్కడున్న అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కేకేఎల్ఎన్ ధర్మారావు, రాష్ట్ర కౌన్సిలర్ దాడిశెట్టి కొండలరావు, జీ సునీల్, కె.శ్రీనివాసరావు, సత్య మహేశ్, అల్లు అప్పలరాజు, దొండపాటి రమేశ్, గోవిందరావు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ వెంచర్‌కు రోడ్డుపై రగడ

▸ దుప్పితూరు మాజీ, ప్రస్తుత సర్పంచుల మధ్య వివాదం

▸ రోడ్డు విస్తరణ చేయిస్తున్న సర్పంచ్

▸ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన మాజీ సర్పంచ్

▸ పనులను నిలుపుదల చేయించిన అధికారులు

అచ్యుతాపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఒక రియల్ ఎస్టేట్ వెంచర్‌కు రోడ్డు వేయడంపై ప్రస్తుత సర్పంచ్, మాజీ సర్పంచ్ మధ్య రగడ జరుగుతోంది. దీంతో ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. మండలంలోని దుప్పితూరు పంచాయతీ సర్వే నంబర్లు 443 నుంచి 447 వరకు సుమారు 23 ఎకరాల భూమిని రియల్ ఎస్టేట్ వెంచర్ కోసం ఒక కాంగ్రెస్ పార్టీ ప్రధాన నాయకుడు కుమారుడు ప్రధాన భాగస్వామిగా ఉన్న జువెంటాస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ప్రాజెక్ట్స్ పేరున గతంలో కొనుగోలు చేశారు. దీని చుట్టూ ప్రహరీ వేసి ప్రధాన ద్వారాన్ని కూడా ఏర్పాటు చేశారు. తర్వాత దీనిని వ్యవసాయేతర భూమిగా మార్పుచేశారు. రియల్ భూమ్ లేకపోవడంతో ప్లాట్లుగా విభజించకుండా అలాగే వదిలేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకోవడంతో ప్లాట్లు వేసి, విక్రయాలు జరపాలని నిర్ణయించారు. అయితే ప్రధాన రహదారి నుంచి ప్లాట్లు విక్రయించే స్థలం వరకు 30 అడుగుల రోడ్డు ఉంటే తప్ప అధికారులు అనుమతులు ఇవ్వరు. దుప్పితూరు కూనిశెట్టి బలిజవారి చెరువు నుంచి దుప్పితూరు వరకు కొంతమేర 12 అడుగులు, కొంతమేర 10 అడుగుల సీసీ రోడ్డు ఉంది. ఈ సీసీ రోడ్డుని ఆనుకొనే కాంగ్రెస్ నాయకులకు చెందిన స్థలం ఉంది. కూనిశెట్టి బలిజ వారి చెరువు గట్టు నుంచి వైసీపీ నాయకుల స్థలం వరకు 30 అడుగుల రోడ్డు ఉంటే తప్ప అధికారులు అనుమతులు మంజూరు చేయరు. అయితే దుప్పితూరు సర్పంచ్ దేశంశెట్టి శంకరరావు వైసీపీకి చెందిన వాడు. అంతేకాక వైసీపీ మండల అధ్యక్షుడు కూడా. దీంతో కాంగ్రెస్ నాయకులు పావులు కదిపి రోడ్డు విస్తరణకు ఏర్పాట్లు చేసుకున్నారు. జంగులూరు జంక్షన్ నుంచి దుప్పితూరుకి వెళ్లే మార్గంలో గత వైసీపీ ప్రభుత్వంలో సచివాలయం, రైతు బరోసా కేంద్రం నిర్మించారు. అంతేకాక జంగులూరు జంక్షన్ నుంచి కూనిశెట్టి బలిజవారి చెరువు గట్టు వరకు అప్పుడే ముందు చూపుతో 30 అడుగుల రోడ్డుని వేశారు. ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు కొనుగోలు చేసి భూమి నుంచి దుప్పితూరు సచివాలయం రోడ్డుకి లింక్ ఇస్తే సులువుగా అధికారులు నుంచి అనుమతులు తీసుకోవచ్చు అనే ఉద్దేశంతో కాంగ్రెస్ నాయకులు దుప్పితూరు సర్పంచ్ శంకరరావు ద్వారా పావులు కదిపారు. దీనికి ఒక టీడీపీ నాయకుడు సహకారం అందించడంతో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించారు. దీనిపై 'రోడ్డు నిర్మాణంపై ఫిర్యాదు' అన్న శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ఈనెల 12న వార్త రావడంతో రెవెన్యూ అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులను ఆపేశారు. దీనిపై వార్త సేకరణకు శనివారం ఆ స్థలం వద్దకు వెళ్లిన 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న ప్రస్తుత సర్పంచ్ దేశంశెట్టి శంకరరావు, మాజీ సర్పంచ్ జూనియర్ నాగేశ్వరరావు అక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా రియల్టర్ నుంచి సర్పంచ్ ప్యాకేజీ తీసుకుంటున్నారని మాజీ సర్పంచ్ ఆరోపించారు. దీంతో ఇరువురు నేతల మధ్య వాగ్వాదం జరుగుతుండగా.. గ్రామస్థులు వచ్చి నచ్చజెప్పడంతో ఇరువురూ అక్కడ నుంచి నిష్క్రమించారు.



రోడ్డు వెడల్పు చేయడానికి దుప్పితూరు సర్పంచ్ తవ్వకాలు జరిపించిన దృశ్యం

అభివృద్ధి కార్యక్రమాలకు అడ్డుపడితే ఎలా..

డీటీకి పాత తీర్మానాలను చూపించిన దుప్పితూరు సర్పంచ్ శంకరరావు

అచ్యుతాపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజావసరాల గురించి అభివృద్ధి కార్యక్రమాలు చేస్తుంటే తప్పుడు ఆరోపణలను నమ్మి పనులు ఆపడం ఎంతవరకు సమంజసమని దుప్పితూరు సర్పంచ్ దేశంశెట్టి శంకరరావు అన్నారు. శనివారం అభివృద్ధి కార్యక్రమాల కోసం గతంలో పంచాయతీ చేసిన తీర్మానాలను ఆయన డీటీ శ్యామ్ కుమార్‌కి చూపించారు. జంగులూరు జంక్షన్ నుంచి దుప్పితూరుకి 2017లో వేసిన రోడ్డునే అభివృద్ధి చేస్తుంటే అధికారులు విచారణ జరపకుండా పనులను అడ్డుకోవడం తగదన్నారు. తాను గత నాలుగేళ్లలో పంచాయతీలో చాలా అభివృద్ధి కార్యక్రమాలు చేశానని, ఇటువంటి ఆరోపణలు రాలేదన్నారు. దీనిపై విచారణ జరిపి ప్రజాభివృద్ధి పనులు నిరోదించకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

భారీ వర్షం

పంటలకు అనుకూలం

లోతట్టు ప్రాంతాలు జలమయం

కోటవురట్ల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంతో మండలంలోని పలు గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఈ వర్షం పంటలకు ఊపిరి పోసింది. మెట్టప్రాంతాల్లో వరి సాగుకు ఉపయోగపడుతుంది. సరుగుడు తోటలు, నువ్వు, పత్తి, కూరగాయాల పంటలకు మేలు చేస్తాయని రైతులు అంటున్నారు. భారీవర్షానికి డ్రైనేజీల్లో పేరుక పోయిన చెత్తచెదారం కొట్టుకుపోయింది.

పాయకరావుపేటలో..

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా శనివారం పాయకరావుపేటలో భారీ వర్షం పడింది. రోజంతా ముసురు పట్టినట్టుగా ఓ మోస్తరు వర్షం పడగా.. మధ్యాహ్నం, సాయంత్రం రెండు దఫాలు భారీ వర్షం పడింది.



మునగపాకలో వర్షం



కోటవురట్లలో వర్షం

దీంతో పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా పంచాయతీ కాలువల్లోని మురికినీరు వర్షపునీటితో కలిసి రోడ్లపై ప్రవహించింది.మెయిన్‌రోడ్డులో పల్లపు ప్రాంతాలు చిన్నపాటి చెరువులను తలపించాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అడపాదడపా పడిన వర్షానికి రోడ్లపై దుకాణాలు, టిఫిన్ బడ్డీల చిరువ్యాపారులు వ్యాపారాలు లేక నష్టపోయారు.

మునగపాకలో..

మండలంలో వారం రోజులుగా అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలు పంటలకు ప్రయోజనం కలిగించే విధంగా ఉన్నాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అయితే లోతట్టు ప్రాంతాల్లో నీట మునిగిన వరి నాట్లు తేరుకునే సమయంలో వర్షాలు కురవడంతో అవి ముంపులోనే ఉంటున్నాయి.

'పేట'లో రోడ్డుపైనే మద్యపానం



చిత్రమందిర్ సెంటర్‌లో రోడ్డుపైనే మందు కొడుతున్న దృశ్యం

పాయకరావుపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వర్షంలో మందు తాగితే ఆ కిక్కే వేరని అనుకున్నారో ఏమో.. మందుబాబులు శనివారం పట్టణంలోని స్థానిక చిత్రమందిర్ సెంటర్ వర్షంలో తడస్తూ రోడ్డు పక్కన మద్యం సేవించారు. మద్యాన్ని పబ్లిక్‌గా సేవించకూడదు. మద్యం దుకాణంలో కొనుగోలు చేసిన మందును పర్మిట్ రూమ్‌లో గుట్టుగా తాగి వెళ్లిపోవచ్చు. అయితే శనివారం ఉదయం భోరున కురుస్తున్న వర్షంలో చిత్రమందిర్ సెంటర్‌లో రోడ్డు పక్కన మోటారు సైకిల్ ఆపి మద్యం సేవిస్తూ కనిపించారు. దీన్ని గమనించిన పలువురు పబ్లిక్‌గా మద్యం సేవిస్తున్నా ఎవరూ పట్టించుకోకపోవడం దారుణమని వ్యాఖ్యానించారు.

వైసీపీ గూటికి మునగపాక ఎంపీపీ



ఎంపీపీ జయలక్ష్మిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ధర్మశ్రీ

అచ్యుతాపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి):మునగపాక ఎంపీపీ మళ్ల విజయలక్ష్మి తిరిగి వైసీపీలో చేరారు. శనివారం కొండకర్లలో గల మాజీ ఎమ్మెల్యే కన్నబాబు రాజు గెస్ట్‌హౌస్‌లో జరిగిన సమావేశంలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఆమెకు పార్టీ కండువాను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ తమ పార్టీలో చేరితే మండలాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని నమ్మబలకటతో మునగపాక ఎంపీపీ జయలక్ష్మి జనసేనలో చేరారన్నారు. జనసేనలో చేరిన తర్వాత ఆమెను పట్టించుకోవడం మానేశారని, కనీస గౌరవం కూడా ఇవ్వడం లేదన్నారు. దీంతో మనస్తాపానికి గురై వైసీపీలో చేరిందని ధర్మశ్రీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు, బొడ్డేడ ప్రసాద్, కోన బుజ్జి, ఆడారి గణపతి, లాలం రాంబాబు, కె. కిరణ్ కుమార్, మారిశెట్టి సూర్యనారాయణ, రావి శోభన్‌బాబు, వానపల్లి శ్రీనివాసరావు, నర్మాల కుమార్, శనివాడ జువ్వాల నాయుడు, గంగిరెడ్డి రాము పాల్గొన్నారు.

ఉపమాక ఆలయానికి పోటెత్తిన భక్తులు



ఉపమాక వెంకన్నను దర్శించుకుంటున్న భక్తులు

నక్కపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక వేంకటేశ్వరస్వామి క్షేత్రం శనివారం భక్తులతో కిటకిటలాడింది. అనేక ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు శ్రీవారి దర్శనం చేసుకున్నారు. కొండపై వున్న స్వామివారి నిజరూపాన్ని, కింద ఆలయంలో వున్న ఉభయదేవేరులతో కూడిన స్వామివారిని, క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి, అండాళ్లమ్మవారిని దర్శించుకున్నారు. తెల్లవారుజామున కొండపై వున్న స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు చేసి అలంకరణ చేశారు. దిగువ ఆలయంలో స్వామివారి ఉత్సవమూర్తులను పట్టుపీతాంబరాలతో అలంకరించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు విస్తరణ నిర్వాసితులకు టీడీఆర్‌ల పంపిణీ



టీడీఆర్ బాండ్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు విస్తరణకు సహకరించిన నిర్వాసితులందరికి ధన్యవాదాలని ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ అన్నారు. శనివారం హరిపాలెంలో టీడీఆర్ బాండ్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హరిపాలెంలో టీడీఆర్ బాండ్లతో పాటు స్ట్రక్చర్ పరిహారాన్ని తీసుకోవడానికి వచ్చిన నిర్వాసితులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఇలా మూకుమ్మడిగా పరిహారాన్ని తీసుకోవడానికి రావడం శుభపరిణామన్నారు. ఈరోడ్డు విస్తరణ జరగడం వల్ల భూమి విలువలు పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జి. సత్యనారాయణ, భైలపూడి శ్రీరామదాసు, జనపరెడ్డి శ్రీనివాసరావు, కె. సూర్యనారాయణ, డ్రీమ్స్ నాయుడు, కరెడ్ల సూర్యప్రకాష్, కె. జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో 933 కేసులు పరిష్కారం



లోక్‌అదాలత్‌లో పరిష్కరించిన కేసుల జాబితాను బ్యాంకు అధికారికి ఇస్తున్న సీనియర్ సివిల్ జడ్జి పి. విజయ

ఎలమంచిలి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి కోర్టు సముదాయంలో శనివారం జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో 933 కేసులు పరిష్కారమయ్యాయి. రాజీ అయిన వారికి రూ. 61,38,527 చెల్లించారు. సీనియర్ సివిల్ జడ్జి పి. విజయ, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.స్పందన, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.రమేష్‌ల ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ టి. సత్యనారాయణ, ఏజీపీ డి. వెంకట్రావు, లోక్‌అదాలత్ మెంబరు పీవీ రమణ, సభ్యులు, ఇతర అధికారులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

వైసీపీ పూర్వవైభవానికి సమష్టి కృషి : ధర్మశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న కరణం ధర్మశ్రీ

ఎలమంచిలి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో వైసీపీ పూర్వవైభవమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ అన్నారు. శనివారం పట్టణంలోని ధర్మవరం కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ ఆవరణలో 8, 9, 10 వార్డులకు చెందిన ప్రజలతో బాబూ ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. త్వరలో వార్డు కమిటీలను మహిళలు, యువత, అన్ని వర్గాల సమ్మేళనంతో నియమిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమవుతుందని ఆరోపించారు. అంతకుముందు మునిసిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరరావు, ఎంపీపీ బోదెపు గోవింద్, వైసీపీ నేతలు కొఠారు కొండబాబు, యర్రయ్యదొర మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, పట్టణ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర, మునిసిపల్ వైస్ చైర్మన్ ఆర్రెపు గుప్తా, కౌన్సిలర్లు సంతోష్, వెంకట్, దూది నరసింహమూర్తి, పిట్టా సత్తిబాబు, నేతలు దాసరి కుమార్, మడగల సత్యనారాయణ, అప్పారావు పాల్గొన్నారు.

మునగపాకలో..

అధికారం లేకపోయినా వైసీపీ శ్రేణులు మనోధైర్యంగానే ఉన్నాయని ఆ పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ అన్నారు. శనివారం రాత్రి మండలంలోని గంటవానిపాలెంలో జరిగిన బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పార్టీ అధికారంలో లేకపోయినా నేతలు, కార్యకర్తలు ధైర్యం వీడలేదన్నారు. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ హామీలు పూర్తి స్థాయిలో అమలు కాకపోయినా కూటమి ప్రభుత్వం విజయోత్సవాలు జరుపుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామిసత్యనారాయణ, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, వైసీపీ మండల అధ్యక్షుడు ఆడారి గణపతి అచ్చింనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు జ్ఞాన సముపార్జనపై దృష్టి పెట్టాలి

భారతీయ వరి పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ సుందరం



ప్రేరణ సదస్సులో మాట్లాడుతున్న భారతీయ వరి పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఆర్ఎం.సుందరం

పాయకరావుపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మార్కుల కోసం కాకుండా జ్ఞాన సముపార్జనపై దృష్టిపెట్టాలని భారతీయ వరి పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఆర్ఎం.సుందరం అన్నారు. శనివారం స్థానిక స్పేసెస్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన యువ ప్రేరణ సదస్సులో ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడారు. మన ఆలోచనల్లో సృజనాత్మకత లేకపోతే కేవలం యాంత్రికంగా మిగిలిపోతామన్నారు. విద్యార్థులు పరీక్షల కోసం కాకుండా తమ జీవిత లక్ష్య సాధనకు సిద్ధంగా ఉండాలన్నారు. సవాళ్లను అధిగమించి అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. ఓటమి చెందినప్పుడు నిరాశ చెందక దానిని ఒక సవాలుగా తీసుకుని సరైన ప్రయత్నం చేస్తే గెలుపు సొంతమవుతుందని తెలిపారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్వీ.ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఇచ్చే ప్రేరణతో ఉన్నత శిఖరాలను చేరగలమన్నారు. మార్కులు మేధస్సుకు కొలమానం కాదని, లక్ష్యసాధన కోసం ఆది నుంచి కృషి చేయాలన్నారు. గెలుపు సాధించాలంటే కొన్ని సంవత్సరాలు కఠోర శ్రమ అవసరమన్నారు. స్పేసెస్ డిగ్రీ కళాశాలతో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) చేసుకున్నామని, భవిష్యత్తులో ఈ విద్యా సంస్థల నుంచి కొంతమంది శాస్త్రవేత్తలు తయారు చేయగలమన్నారు. అనంతరం శ్రీప్రకాష్ విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే.నరసింహారావు, ప్రెసిడెంట్ డాక్టర్ కంటిపూడి సరేంద్రబాబు, సంయుక్త కార్యదర్శి సీహెచ్. విజయ్‌ప్రకాష్ అకడమిక్ క్యాలెండర్‌ని విడుదల చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, డీన్ డాక్టర్ వీవీఎస్. బంగార్రాజు, వైస్ ప్రిన్సిపాల్ పెనుగొండ సుబ్బారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నక్కపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మనబాలవానిపాలెం హైవే జంక్షన్ వద్ద శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. అచ్యుతాపురానికి చెందిన కర్రి అప్పారావు (60) మనబాలవానిపాలెం వద్ద రోడ్డుదాటుతుండగా నక్కపల్లి నుంచి తుని వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో అతను తీవ్రంగా గాయపడినట్టు ఎస్ఐ సన్నిబాబు చెప్పారు. అప్పారావు కాలు,చేతికి తీవ్రగాయాలవ్వడంతో ప్రాథమిక చికిత్స అనంతరం అనకాపల్లి ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

22 నుంచి నూకాంబిక ఆలయంలో
శరన్నవరాత్రి ఉత్సవాలు
పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే కొణతాల


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, తదితరులు


జగన్నాథస్వామి ఆలయం వద్ద ముహూర్తపు రాట వేస్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవోపేతంగా జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఇక్కడ ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలను ఘనంగా నిర్వహించడంతో పాటు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నూకాంబిక ఆలయ మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, ఆలయ మాజీ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవికుమార్, పొలిమేర ఆనంద్, మారిశెట్టి శంకరరావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వద్దాది మంగ, కోసేటి సూర్యలక్ష్మి, యర్రవరపు లక్ష్మి, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలావుంటే, జగన్నాథస్వామి ఆలయం వద్ద దేవీ నవరాత్రి వేడుకలకు సంబంధించి ముహూర్తపు రాటను వేశారు. తొలుత అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. కర్రి రమేష్ ఆధ్వర్యంలో ఈనెల 22 నుంచి అక్టోబరు రెండో తేదీ వరకు వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. మాజీ కౌన్సిలర్ బొడ్డేడ దుర్గలక్ష్మి, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం


చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న ఆటో డ్రైవర్లు

పరవాడ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : దసరాకు వాహనమిత్ర పథకంలో భాగంగా ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు చొప్పున అందజేయనున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించడంతో స్థానిక సంతబయలు వద్ద ఆటో యూనియన్ నేతల ఆధ్వర్యంలో డ్రైవర్లు సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు హాజరై వీరితో పాటు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యంగా పేర్కొన్నారు. యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు అందరికీ పథకం వర్తించేలా చూడాలని కోరారు. పథకాన్ని ప్రకటించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు బొద్దపు అయ్యబాబు, చుక్క గోపి, సింహాద్రిరావు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎల్లుప్పి దళిత రైతులకు న్యాయం చేయాలి : బాబ్జీ


పశువుల పాకలు కోల్పోయిన దళిత రైతులతో మాట్లాడుతున్న గండి బాబ్జీ

సబ్బవరం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎల్లుప్పి గ్రామంలో పశువుల పాకలు కోల్పోయిన నిరుపేద దళిత రైతులకు న్యాయం చేయాలని టీడీపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి, ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ అధికారులను కోరారు. శనివారం సదరు గ్రామాన్ని సందర్శించి రైతులను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎల్లుప్పి గ్రామం సర్వే నెంబరు 16లో గల గెడ్డ వాగు/ప్రభుత్వ భూమిలో గ్రామానికి చెందిన పేద దళిత రైతులు కాకర అమ్మతల్లి, వెంకట రమణ, గోపీనాథ్, చినఅప్పలరాజు, చందేశ్వరరావు, యల్లపు అంబేడ్కర్ మచ్చ దేవుడు తదితరులు తాత తండ్రుల నుంచి పశువుల పాకలు వేసుకొని జీవనం సాగిస్తున్నారన్నారు. ఇటీవల ఒక రియల్టర్ రెవెన్యూ అధికారుల సహకారంతో పలు సర్వే నెంబర్లలో గెడ్డ వాగులను పూడ్చేసి సుమారు 150 ఎకరాల లే-అవుట్‌కు నలభై అడుగుల రోడ్డు వేసుకున్నారని తెలిపారు. సర్వే నెంబరు 16 గెడ్డవాగుకు పక్కన ఏడుగురు రైతులకు చెందిన పాకలను గత బుధవారం రెవెన్యూ అధికారులు ఎటువంటి సమాచారం తెలపకుండా కూల్చివేయడం తగదన్నారు. రియల్టర్ వేసుకున్న రోడ్డుకు అడ్డంగా లేకపోయిన పశువుల పాకలు కూల్చివేయడం ఎందుకని ప్రశ్నించారు. సదరు దళిత రైతులకు అధికారులకు న్యాయం చేయకుంటే పోరాటం సాగిస్తానని హెచ్చరించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు గండి దేముడు, టీడీపీ మండల అధ్యక్షుడు గండి ముత్యాలనాయుడు, గ్రామ పెద్దలు పాపాన ఎల్లాజీనాయుడు, అమరపిన్ని నర్సింగరావు, ఎల్లాజీ, పాపాన పెదబాబు, గంతకోరు సూర్యనారాయణ, ఉగ్గిన కనకనాయుడు, లోకిరెడ్డి దుర్గారావు, రావర్తి అప్పలనాయుడు, సమ్మింగ చంటి తదితరులు పాల్గొన్నారు.

'సీతారాం ఏచూరి స్ఫూర్తితో ప్రజా పోరాటాలు'



సీతారం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : దివంగత సీపీఎం నేత సీతారాం ఏచూరి స్ఫూర్తితో ప్రజా పోరాటాలు సాగించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఇక్కడి సీఐటీయూ కార్యాలయంలో ఏచూరి ప్రథమ వర్థంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మితవాద శక్తుల ప్రాబల్యం పెరుగుతున్న నేపథ్యంలో వాటిని ఎదుర్కొనేందుకు సీతారాం ఏచూరి స్ఫూర్తితో ప్రజా పోరాటాలు సాగించాలన్నారు. కార్మిక, కర్షకుల హక్కుల సాధనకు తుదిశ్వాస వరకు పోరాడారని కొనియాడారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గంటా శ్రీరామ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రుత్తల శంకరరావు, శ్రీనివాసరావు, ఈశ్వరరావు, తేలయ్యబాబు, సుభాషిణి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ మినీ కేంద్రాలు మెయిన్‌గా మార్పు

▸▸ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్న అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగశేషు

▸▸ అనకాపల్లిలో అభినందన సభ ▸▸ పోరాటాల ద్వారానే సాధించామని వెల్లడి



అభినందన సభలో మాట్లాడుతున్న అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగశేషు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ మినీ కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం మెయిన్ కేంద్రాలుగా మార్పు చేసిందని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగశేషు ఆనందం వ్యక్తం చేశారు. ఇక్కడి సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం దొడ్డి రామునాయుడు భవనంలో జరిగిన అభినందన సభలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా మార్చాలని గతంలో అనేక సంవత్సరాలుగా పోరాటాలు సాగించామన్నారు. దీంతో ప్రభుత్వం 4,687 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా మార్పు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్టు చెప్పారు. గత ప్రభుత్వ కాలంలో 42 రోజులు సమ్మె చేసిన సందర్భంగా నాటి ప్రభుత్వం మినీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా మారుస్తామని హామీ ఇచ్చిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం పదిహేను నెలల కాలంలో మరలా పోరాటం చేయడంతో మినీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా మార్చిందని ఆనందం వ్యక్తం చేశారు. ఇంకా రాష్ట్రంలో 1,810 కేంద్రాలు మెయిన్ కేంద్రాలుగా మార్చలేదని పేర్కొన్నారు. జన సంఖ్య తక్కువగా ఉందని, పదో తరగతి లేని కారణంతో ఆపారని వివరించారు. వాటిని కూడా మెయిన్ కేంద్రాలుగా మార్పు చేయాలని ఆమె కోరారు. లేనిపక్షంలో మెయిన్ కేంద్రాల టీచర్లతో సమానంగా జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు సీహెచ్.రామలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ అభినందన సభలో జిల్లా అధ్యక్షురాలు ఎం.దుర్గారాణి, ఎన్.వరలక్ష్మి, భ్రమరాంబ, రామలక్ష్మి, సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను వెనక్కి తీసుకోవాలి

▸▸ రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి చెన్నకేశవులు



రాజ్యాంగ పరిరక్షణ యాత్రకు స్వాగతం పలుకుతున్న సంఘాల నేతలు

కొత్తూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు రాజ్యాంగ పరిరక్షణ యాత్ర పూర్తి చేసుకొని వస్తున్న బృందానికి శనివారం వివిధ సంఘాల నాయకులు, ఉద్యోగులు అనకాపల్లిలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నెహ్రూచౌక్ కూడలి, భీమునిగుమ్మం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహాలకు బృందం ప్రతినిధులు పూలమాలలు వేసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి చెన్నకేశవులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను వెనక్కి తీసుకోవాలన్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ శాతాన్ని పెంచాలని, దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా ఇచ్చి దళితులపై జరుగుతున్న దాడులకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్‌బాబు, అనకాపల్లి జిల్లా ఆర్‌పీఐ అధ్యక్షుడు మల్లారపు లోవచంద్, డీవీఎంసీ సభ్యుడు రేబాక మధుబాబు, దళిత నాయకులు మర్రా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

▸▸ విద్యార్థులకు మహిళా శిశు సంక్షేమ అధికారిణి సూర్యలక్ష్మి సూచన



మాట్లాడుతున్న జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారిణి సూర్యలక్ష్మి

కొత్తూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ (స్టెమ్)తో ఉజ్వల భవిష్యత్తు అని మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి ఎన్.ఎన్.సూర్యలక్ష్మి అన్నారు. ఇక్కడి ఏఎంఏఎల్ కళాశాలలో విద్యార్థులకు శనివారం ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. సమస్యల పరిష్కార నైపుణ్యాలను విద్యార్థులు పెంపొందించుకోవాలన్నారు. అలాగే, బాల్య వివాహాలను అంతా వ్యతిరేకించాలని, మహిళలపై హింసను నిరోధించాలని పేర్కొంటూ బాల బాలికల చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.జయబాబు, సూపరింటెండెంట్ అనురాధ, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కో-ఆర్డినేటర్ సామ్రాజ్యం, వన్ స్టాప్ సెంటర్ కార్య నిర్వహణాధికారి కేఎంవీ మంజులవాణి, ప్రొటెక్షన్ ఆఫీర్ మనోహర్, పారా లీగల్ సునీత, కౌన్సిలర్ సంతోషి, ఎల్‌సీపీ రమాజ్యోతి, గ్రామ మహిళా సంక్షేమ కో-ఆర్డినేటర్ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీతోనే బహుజనులకు సాధికారత

▸▸ సంకల్ప సభలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న గౌతమ్‌కుమార్

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : బహుజనుల సాధికారత బీఎస్పీతోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ అన్నారు. శనివారం ఇక్కడి నెహ్రూచౌక్‌లో జరిగిన బహుజన సంకల్ప సభలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. అధికారం లేని కులాలపై దాడులు, అత్యాచారాలు జరుగుతున్నాయని ఆరోపించారు. దోపిడీ, బానిసత్వం నుంచి బయట పడాలంటే రాజకీయ అధికారం ఒక్కటే శరణ్యమని పేర్కొన్నారు. అత్యధిక శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఓట్లు మన నాయకులకు వేసుకుంటే అంబేడ్కర్, పూలే, కాన్షిరామ్ కలలు కన్న బహుజన సంక్షేమ రాజ్యం సిద్ధిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోను కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కొల్లాబత్తుల సత్యం, తిరుపతిరావు, సోము రాంబాబు, కదిరి రాము, అనకాపల్లి జిల్లా నాయకులు సూదికొండ మాణిక్యాలరావు, పరవాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి టెన్నీకాయిట్ పోటీలకు గురుకుల విద్యార్థుల ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ తదితరులు

సబ్బవరం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయానికి చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండపేటలో ఈ నెల 13, 14 తేదీల్లో జరగనున్న ఈ పోటీలకు పదో తరగతి చదువుతున్న పి.సాగర్, ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న అభిలాష ఎంపికయ్యారని వివరించారు. ఈ విద్యార్థులకు విద్యాలయంలో అభినందించి, పోటీల్లో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ వైస్ ప్రిన్సిపాల్ కె.చిరంజీవిరావు, ఫిజికల్ డైరెక్టర్ సీఎల్ఎన్ ప్రసాద్, పీఈటీ వి.సూర్యనారాయణ, ఉపాధ్యాయులు రాంబాబు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శక సేవలకే స్మార్ట్ రేషన్ కార్డులు

▸▸ ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు


లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

పరవాడ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పేద వర్గాలకు పారదర్శకంగా రేషన్ సరకులు పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ కార్డులను ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. పరవాడలో శనివారం ఏర్పాటు చేసిన స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీలో మాట్లాడారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చి పేదలకు పూర్తిస్థాయిలో న్యాయం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు ముందడుగు వేశారన్నారు. గ్రామ సచివాలయ ఉద్యోగుల ద్వారా స్మార్ట్ రేషన్‌కార్డులను ఇంటింటికీ పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్డుల ద్వారా ఎటువంటి అవకతవకలు జరగకుండా నేరుగా లబ్ధిదారులకు నిత్యావసర వస్తువులు అందజేస్తారన్నారు. అలాగే ఏ డిపోలోనైనా స్మార్ట్‌కార్డు స్కాన్ చేసి రేషన్ సరుకులు పొందవచ్చునని వివరించారు. ప్రతి డిపో ద్వారా నెలలో 25 రోజుల పాటు సరకులు పంపిణీ చేసేలా చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి.నాగరాజు, ఎంపీడీవో బి.రమేష్ నాయుడు, పంచాయతీ కార్యదర్శి మురళీధర్ పట్నాయక్, సర్పంచ్ శిరపురపు అప్పలనాయుడు, మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, కూటమి నాయకులు పైలా సన్యాసిరావు, పైలా రామచంద్రరావు, కన్నూరు వెంకటరమణ, కూండ్రపు సోమునాయుడు, బొద్దపు శ్రీనివాసరావు, పైలా చిన అక్కునాయుడు, వియ్యపు చిన్న, బొద్దపు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జిల కింద రహదారులకు మరమ్మతులు చేపట్టాలి

▸▸ ఎంపీ, ఎమ్మెల్యేకు అఖిల పక్షాల నాయకులు విజ్ఞప్తి


సత్యనారాయణపురం రైల్వే అండ్ బ్రిడ్జి వద్ద దొంగ గెడ్డను పరిశీలిస్తున్న నేతలు

కొత్తూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి పట్టణానికి ఆనుకొని ఉన్న విజయరామరాజుపేట, సత్యనారాయణపురం అండర్ బ్రిడ్జి కింద రహదారులకు మరమ్మతులు చేపట్టాలని అఖిల పక్షాల నాయకులు కోరారు. ఈ మేరకు సీపీఐ నాయకుడు వైఎన్ భద్రం, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు కొణతాల హరినాథ్‌బాబు, బీఎస్పీ నాయకుడు సూదికొండ మాణిక్యాలరావు తదితరులు ఆయా రైల్వే అండ్ బ్రిడ్జిలను శనివారం పరిశీలించి మాట్లాడారు. అనకాపల్లి పార్లమెంటు పరిధిలోని అనకాపల్లి, ఎలమంచిలి రైల్వే స్టేషన్ల అభివృద్ధికి రూ. ఏడు కోట్లకు పైగా నిధులను కేంద్రం మంజూరు చేసిందని ఎంపీ సీఎం రమేశ్ ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అలాగే, అండర్ బ్రిడ్జిల కింద రహదారులకు మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు చేపట్టాల్సిందిగా కోరారు. దశాబ్దాల కాలంగా సత్యనారాయణపురం మూలపేట వద్ద దొంగ గెడ్డ అండర్‌బ్రిడ్జి రహదారిలో నీరు ప్రవహిస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారన్నారు. చిన్నపాటి వర్షానికి ఈ గెడ్డ అకస్మాత్తుగా పొంగితే ఆ దారి గుండా వెళ్లే సత్యనారాయణపురం, మూలపేట, బీఆర్‌టీ కాలనీతో పాటు మరో పది కాలనీల ప్రజలు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని ఉండాల్సి వస్తుందన్నారు. ఇదే దొంగ గెడ్డ గుండా పాఠశాలలకు పిల్లలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారన్నారు. వారంతా తిరిగి ఇంటికి చేరేవరకు తల్లిదండ్రులు ఆందోళన చెందుతుంటారని వివరించారు. ఇప్పటికైనా ఎంపీ, ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించాలని వారు కోరారు.

'కేసులు సత్వర పరిష్కారానికి లోక్‌అదాలత్ చక్కని వేదిక'

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కేసులు సత్వర పరిష్కారానికి లోక్‌అదాలత్ చక్కని వేదికని ఎనిమిదవ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి, పదవ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి ఇన్‌చార్జి కవిత అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం కోర్టు ఆవరణలో లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా కక్షిదారులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. చిన్నచిన్న సమస్యలతో కోర్టు మెట్లు ఎక్కి కాలం వృథాతో పాటు ఆర్థికంగా నష్టపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి నాగేశ్వరరావు, అడిషనల్ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి రామకృష్ణ, మొదటి అదనపు తరగతి జూనియర్ సివిల్ జడ్జి రమేష్, రెండో అదనపు తరగతి జూనియర్ సివిల్ జడ్జి విజయలక్ష్మి, మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి నిఖిత, బార్ అసోసియేషన్ అధ్యక్షులు పిళ్లా హరశ్రీనివాసరావు, సెక్రటరీ బంధం రమణ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం : బుద్ద

అనకాపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయిన తరువాత రాష్ట్రంలో అన్ని రంగాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, ముఖ్యంగా వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. శనివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందుతున్నాయన్నారు. చంద్రబాబు కృషి ఫలితంగానే రాష్ట్రంలో 10.75 శాతం వృద్ధి రేటు సాధించారని, ఇది జాతీయ స్థూల రేటు కన్నా ఎక్కువ అని పేర్కొన్నారు. వ్యవసాయ, నీటి పారుదల, పారిశ్రామిక, నిర్మాణ రంగాల్లో తీసుకున్న నిర్ణయాలు కారణంగా వృద్ధి సాధ్యమైందని అభిప్రాయపడ్డారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఐదేళ్లలో జాతీయ సగటు రేటు కంటే జీఎస్‌డీపీ 6.5 శాతం మాత్రమే ఉందని గుర్తు చేశారు. నాటి పాలకుల నిర్వాకంతో వృద్ధి రేటు అన్ని రంగాల్లో వెనుకబడిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాని సమ ప్రాధాన్యం ఇస్తూ పాలన సాగుతుందని స్పష్టం చేశారు.

శారదానగర్‌లో ఆక్రమణల తొలగింపు


ఆక్రమణలను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

కొత్తూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి శారదానగర్ ప్రధాన రహదారిలో ఆక్రమణలను శనివారం పంచాయతీ అధికారులు తొలగించారు. కాలువలను ఆక్రమించడం వల్ల అందులోని చెత్తాచెదారాన్ని తొలగించేందుకు ఆస్కారం లేకపోతోంది. దీంతో మురుగుతో పాటు వర్షపు నీరు పలుచోట్ల రోడ్లపైకి చేరుతోంది. ఇది గుర్తించిన అధికారులు కాలువలపై కట్టడాలను తొలగించారు. ఇలా అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని పంచాయతీ కార్యదర్శి సుభాష్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సప్పారపు లక్ష్మీ ప్రసన్న, ఉప సర్పంచ్ అనపర్తి శ్రీనివాస్, వార్డు సభ్యులు పందల శ్రీనివాస్, తాడి చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీగణపతిని దర్శించుకున్న మాజీ మంత్రి అమర్‌నాథ్


స్వామి చిత్రపటాన్ని అందిస్తున్న నిర్వాహకులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో సంపత్ వినాయక సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ లక్ష్మీ గణపతి విగ్రహాన్ని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ శనివారం దర్శించుకున్నారు. నిర్వాహకులు ఆయనను సత్కరించి స్వామి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మందపాటి జానకిరామరాజు, కొణతాల మురళీకృష్ణ, మళ్ల బుల్లిబాబు, జాజుల రమేష్, దాడి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి వినతి

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని సిద్ధార్థ సోషల్ సర్వీసెస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బల్లా నాగభూషణం తదితరులు కోరారు. ఈ మేరకు శనివారం ట్రాఫిక్ సీఐ ఎం. వెంకటనారాయణను కలిసి వినతి పత్రం అందజేశారు. రోజు రోజుకు ట్రాఫిక్ పెరుగుతుండడంతో వాహనదారులు, పిల్లలు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. చిన్నచిన్న ప్రమాదాలు కూడా జరుగుతున్నాయన్నారు. చిరు వ్యాపారులు పార్కింగ్ స్థలాలను ఆక్రమించి వ్యాపారాలు చేయడం సమస్య తలెత్తుతున్నట్టు వివరించారు. ఈ సమస్యపై వెంటనే స్పందించాలని విన్నవించారు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ


విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్

లంకెలపాలెం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు పరిధి లంకెలపాలెంలోని బీసీ బాలుర వసతి గృహంలో గల రెండు వందల మంది విద్యార్థులకు స్థానికులు దుప్పట్లు సమకూర్చారు. వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ చేతుల మీదుగా శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటలక్ష్మి, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

రంపుల ఘాట్ రోడ్డుపై విరిగిపడుతున్న కొండచరియలు

» ప్రయాణికుల భయాందోళన

చింతపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కృష్ణాదేవిపేట-చింతపల్లి ప్రధాన రహదారి రంపుల ఘాట్ రోడ్డులో కొండచరియలు, బండరాళ్లు పడుతున్నాయి. దీంతో ఈ మార్గంలోని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. రాజమహేంద్రవరం నుంచి రంపుల ఘాట్, చింతపల్లి, పాడేరు, అరకులోయ మీదుగా విజయనగరం వరకు జాతీయ రహదారి 516-ఈ నిర్మాణం జరుగుతోంది. లంబసింగి ఘాట్‌లో కొండలను తొలిచి రహదారిని నిర్మించారు. కొన్ని చోట్ల రక్షణ గోడ ఓ మాదిరి ఎత్తు వరకు నిర్మించారు. ఘాట్‌లో 80శాతం రహదారికి ఆనుకుని ఉన్న కొండ వద్ద ఎటువంటి రక్షణగోడలేదు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కొండచరియలు, బండరాళ్లు రహదారిపై పడుతున్నాయి. శనివారం రంపులఘాట్ రోడ్డులో పలు చోట్ల కొండచరియలు


పెదవలస ఘాట్ బురదలో కూరుకుపోయిన లారీ


రంపుల మూడో మలుపు వద్ద పడిన కొండచరియలు

రహదారిపై పడ్డాయి. జాతీయ రహదారుల అధికారులు ఇక్కడి రహదారిపై కొండచరియలు పడకుండగా చర్యలు తీసుకోవాలని ప్రాంతీయ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పెదవలస ఘాట్‌లో నిలిచిన లారీ.. రాకపోకలకు అంతరాయం

గూడెంకొత్తవీధి: మండలంలోని పెదవలస ఘాట్‌లో లారీ బురదలో కూరుకుపోయింది. దీంతో ఈ మార్గంలో మూడు గంటలపాటు రాకపోకలకు అంతరాయం కలిగింది. శుక్రవారం సాయంత్రం ఒడిశా నుంచి పెద్దాపురంనకు ఊకను తరలిస్తున్న లారీ ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను తప్పించే క్రమంలో బురదలో కూరుకుపోయింది. స్థానికులు లారీకి పక్కన మట్టిని తొలగించడంతో మూడు గంటల తరువాత రాకపోకలు కొనసాగాయి. శనివారం ఉదయం ఎక్స్‌కవేటర్‌తో లారీని వెలికి తీశారు.

గిరిజన సమాఖ్య నూతన కార్యవర్గం ఎన్నిక


సంఘీభావం తెలుపుతున్న ప్రతినిధులు

సీలేరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం ధారకొండ పంచాయతీ చిన్నగంగవరంలో శనివారం ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య మండల సమితి సమావేశం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కూడా రాధాకృష్ణ, జిల్లా అధ్యక్షుడు దిసారి సతీశ్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక నిర్వహించారు. మండల గిరిజన సమాఖ్య కార్యదర్శిగా పాంగి నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా బురిడి రాము, గౌ శ్కోరి సొదనో, మండల అధ్యక్షుడిగా తమర్బా బలరామ్, ఉపాధ్యక్షుడిగా కిల్లో రమేశ్ మండల సమితి ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా 20 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీపీఐ నేతలు సుంకరి విష్ణుమూర్తి, పి పోతురాజు, దుప్పులవాడ మాజీ ఎంపీటీసీ సభ్యుడు కిల్లో గోపీనాథ్, నాయకులు వర్ల భగవాన్, చిట్టిబాబు, దొర నారాయణ, త్రినాథ్ పాల్గొన్నారు.

నేడు మెగా కరాటే బెల్ట్ టెస్ట్

» ముఖ్య అతిథిగా పాల్గొననున్న సినీ నటుడు సుమన్



ఎల్లో బెల్ట్ సాధించిన విద్యార్థులు

పాడేరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు సుమన్ పాడేరుకు ఆదివారం విచ్చేయనున్నారు. స్థానిక తలారిసింగి ఆశ్రమ పాఠశాల క్రీడామైదానంలో రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించే మెగా కరాటే బెల్ట్ టెస్ట్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు. ఈటెస్ట్‌లో వివిధ కరాటే శిక్షణ సంస్థలకు చెందిన సుమారుగా 400 మంది విద్యార్థులు/అభ్యర్థులు పాల్గొంటారు.

50 మంది విద్యార్థులకు ఎల్లో బెల్ట్ ప్రదానం

స్థానిక పాండు కరాటే అకాడమీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక మోదకొండమ్మ ఆడిటోరియంలో నిర్వహించిన బెల్ట్ టెస్ట్ కార్యక్రమంలో సుమారుగా 150 మంది పాల్గొనగా, 50 మంది విద్యార్థులు ఎల్లో బెల్ట్ సాధించారు. దీంతో వారికి కరాటే అకాడమీ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ బాకూరు పాండురాజు, ట్రైనర్లు ఎల్లో బెల్ట్‌లను ప్రదానంగా చేశారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్స్ అప్పన్న, సురేశ్, సత్యసురేశ్, సూర్యప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా సీమకొండ రోడ్డు


రాళ్ళు తేలిన రోడ్డుపై నడుచుకుంటూ పాఠశాలకు వెళుతున్న విద్యార్థులు

పెదబయలు, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాలుగు పంచాయతీలకు సంబంధించి ప్రధాన రహదారి ఛిద్రం కావడంతో రాకపోకలకు గిరిజనులు అవస్థలు పడుతున్నారు. గెల్లెలు పంచాయితీ సీమకొండకు వెళ్లే మార్గం ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురై గోతులతో ఛిద్రమైంది. రాళ్ళు తేలిన ఈ రోడ్డుపై రాకపోకలు సాగించాలంటే వెన్నులో వనుకు పుడుతుందని గిరిజనులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.బొంగరం, ఇంజరీ, గిన్నెలకోట, జామిగూడ పంచాయతీలకు చెందిన గ్రామాల గిరిజనులు నిత్యం ఈ మార్గంలోనే పెదబయలు, ముంచంగిపుట్టు, జీ మాడుగుల వారపు సంతలకు, ఆస్పత్రులకు వెళుతుంటారు. ఈ రోడ్డు ధ్వంసం కావడంతో ప్రమాదాలుచోటు చేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి రోడ్డును మరమ్మతులు చేపట్టాలని సీమకొండ గ్రామస్థులు కోరుతున్నారు.

'రణభేరి'ని విజయవంతం చేయాలి: యూటీఎఫ్


కరపత్రాలను విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

పాడేరురూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలపై ఈ నెల 15వ తేదీన నిర్వహించనున్న రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూ టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వి.మహేశ్వరరావు కోరారు. శనివారం స్థానిక జిల్లా కార్యాలయం వద్ద యూటీఎఫ్ నాయకులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యా రంగ సమస్యలు, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారంలో తీవ్ర నిర్లక్ష్యం చేసిందన్నారు. ఫలితంగా వైసీపీ గత ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలవుతున్నా, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో చొరవచూపకపోవడం తగదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆర్థిక బకాయిలన్నీ చెల్లిస్తుందని, పీఆర్సీ కమిటీ వేస్తారని, ఐఆర్ 30 శాతం చెల్లిస్తారని ఆశించిన ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు భంగపాటు తప్ప మరొకటి లేదన్నారు. ఈ స్థితిలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 15వ తేదీ నుంచి 19వ తేదీ వరకు రణభేరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా నాయకులు టి. చిట్టిబాబు, ఎం.ధర్మారావు, పి.దేముడు, ఎస్.కన్నయ్య, కె.రఘునాథ్, ఎల్.నారాయణ, ఎస్.రాంబాబు, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రపంచ సెప్సిస్ డే ర్యాలీ



అవగాహన ర్యాలీ చేస్తున్న జిల్లా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది

పాడేరురూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ సెప్సిస్) డే సందర్భంగా స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది భారీ అవగాహన ర్యాలీని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.హేమలతాదేవి మాట్లాడుతూ ఏటా సెప్టెంబరు 13వ తేదీన ప్రపంచ సెప్సిస్ డేగా గుర్తిస్తారన్నారు. ఈ ఏడాది థీమ్ 5 ఫ్యాక్ట్స్ అండ్ 5 యాక్షన్స్‌గా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ర్యాలీని చేపట్టామన్నారు. అనంతరం హెచ్‌వోడీ (మెడిసిన్) డాక్టర్.సురేశ్వర రెడ్డి మాట్లాడుతూ సెప్సిస్‌కు గల కారణాలు, లక్షణాలు, ఈ వ్యాధి ప్రాణాపాయానికి దారితీసే పరిస్థితులను వివరించారు. ఆస్పత్రిలో శుభ్రత, హ్యాండ్ వాషింగ్ టెక్నిక్స్‌ను డాక్టర్ శ్రీనివాసు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్.నర్సింగరావు, ఫ్యాకల్టీ సభ్యులు, డాక్టర్లు, హెచ్‌వోడీలు, ఎం ఎన్‌వోలు, ఎఫ్ఎంవోలు పాల్గొన్నారు.

'రైతుల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం'


రాజ్‌మా చిక్కుడు విత్తనాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నేత ప్రసాద్ తదితరులు

కొయ్యూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ రైతుల సంక్షేమం దృష్ట్యా రాజ్‌మా చిక్కుడు విత్తనాలను 90 శాతం రాయితీపై ప్రభుత్వం సరఫరా చేస్తున్నదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎంవీవీ ప్రసాద్ సూచించారు. శనివారం స్థానిక రైతు సేవా కేంద్రంలో వ్యవసాయశాఖ, పోలీస్‌శాఖ సంయుక్తంగా మండలంలో బూదరాళ్ళ, ఎం. భీమవరం, యు. చీడిపాలెం, మర్రివాడ పంచాయతీలకు చెందిన 1020 మంది రైతులకు, 180 క్వింటాళ్ల రాజ్‌మా విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ గంజాయి సాగును పూర్తిగా విడిచి పెట్టి అంతర్జాతీయ మార్కెట్‌లో ఎంతో విలువ గల రాజ్‌మా పంటను ప్రోత్సహించి తద్వారా రైతు ఆర్థికాభివృద్ధి చేందాలన్న ధ్యేయంతో ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుందన్నారు. అనంతరం ఏవో రాజ్ కుమార్, బూదరాళ్ళ సర్పంచ్ ముత్యాలమ్మ, వార్డు సభ్యుడు సంజీవ్, కూటమి నాయకులు చంద్రరావు, త్రినాధ, నారాయణ వ్యవసాయ సిబ్బంది, గిరిజన రైతులు పాల్గొన్నారు.

శ్రమదానంతో రహదారి మరమ్మతులు


మరమ్మతు పనుల్లో గిరిజనులు

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూతురు గ్రామానికి చెందిన ఆదివాసీలు శ్రమదానంతో రహదారి మరమ్మతులు చేసుకున్నారు. గత 15 రోజులుగా కురుస్తున్న వర్షాలకు గూడెంకొత్తవీధి ప్రధాన రహదారి నుంచి నూతులు గ్రామానికి వెళ్లే రహదారి పలు చోట్ల కోతకు గురైంది. స్థానిక గిరిజనులంతా కలిసి ఈ రహదారిని మరమ్మతులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ మండలాధ్యక్షుడు గుంట బుజ్జిబాబు, తదితరులు పాల్గొన్నారు.

కాఫీ తోటల్లో బెర్రీ బోరర్ కీటకంపై అప్రమత్తం


రైతులకు అవగాహన కల్పిస్తున్న విజయవాహిని ట్రస్టు ప్రతినిధి నూకరాజు

చింతపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులు కాఫీ బెర్రీ బోరర్ కీటకంపై అప్రమత్తం కావాలని విజయవాహిని చారిటబుల్ ట్రస్టు ప్రతినిధి తాడి నూకరాజు అన్నారు. శనివారం మండలంలోని పెద్దగెడ్డ గ్రామంలో రైతులకు అయన అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కాఫీ బెర్రీ బోరర్ కీటకం కాయలు, పండ్ల లోపలకు ప్రవేశించి గింజను నాశనం చేస్తుందన్నారు. ఈకీటకం వల్ల దిగుబడులు పూర్తిగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. ఈకీటకం ఉధృతిని ప్రాథమిక స్థాయిలోనే అరికట్టాలన్నారు. కాఫీ కాయలు, పండ్లలో నల్లని రంధ్రాలు కనిపిస్తే బెర్రీ బోరర్ కీటకం ఆశించిందని గుర్తించాలన్నారు. ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ రైతులు ఉల్లి శివాజి, పొటుకూరి సుదర్శన్, సీఆర్‌పీ రాజారావు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చిట్టబ్బాయి

పాడేరురూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం హిందీ దివస్‌ను హిందీ శాఖ అధ్యాపకురాలు వారిజ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్.వనుము చిట్టబ్బాయి మాట్లాడుతూ హిందీ భాష ప్రయోజనాన్ని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హిందీ పద్యాలు, నినాదాల పోస్టర్ల ప్రదర్శన ద్వారా వివరించారు. అనంతరం విద్యార్థులకు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్. టీఎన్. రసూల్, అధ్యాపకులు బి.రమేశ్, జి.దామోదరం, డి.గణేష్, పి.జానకీరావు, పి.కోటేశ్వరరావు, కె.నిర్మల, ఎం.రాధాకుమారి, జి.గౌరీశంకరరావు, కె.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ అప్పలరాజు, సర్పంచ్ అప్పలమ్మ

జి.మాడుగుల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మారుమూల గిరిజన గ్రామాలకు రహదారి సదుపాయాలు కల్పిస్తున్నట్టు ఎంపీపీ ఎల్.అప్పలరాజు పేర్కొన్నారు. శనివారం గడుతూరు పంచాయతీ వెదురుపల్లి నుంచి నెయ్యాలబంద వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు ఆయన స్థానిక సర్పంచ్ కొండపల్లి అప్పలమ్మతో కలిసి శంకుస్థాపన చేశారు. పీఎం జన్‌మన్ నిధులు రూ. 10.83 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ రోడ్డు పూర్తయితే, సుమారుగా 12 గిరిజన గ్రామాలకు రవాణా కష్టాలు తీరుతాయని స్పష్టం చేశారు. మాజీ ఎంపీపీ పద్మా, టీడీపీ నేతలు కె.సింహాచలం, చిన్నయ్య, పిన్నయ్య, కృష్ణమూర్తి, బాబూరావు, కొండబాబు, వెంకటరావు, సూరిబాబు, కొండలరావు, అప్పారావు, ఆనంద్, ప్రశాంత్, పాల్గొన్నారు.

దేవీ ఉత్సవాలకు ముహూర్తపు రాట


ముహూర్తపు రాట కార్యక్రమంలో భవానీ భక్తులు

సీలేరు, సెప్టెంబరు 13 , (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరులో దేవీ నవరాత్రి మహోత్సవాల పందిరి ముహూర్తపు రాట శనివారం నిర్వహించారు. స్థానిక దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 36 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా దుర్గాదేవి మండపం వానపల్లి అప్పారావు దంపతుల ఆధ్వర్యంలో పందిరి రాట వేశారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు చందాల వసూళ్ల ప్రారంభించారు. స్థానిక సర్పంచ్ పి దుర్గో, ఎంపీటీసీ సభ్యుడు పి. సాంబమూర్తి, వైస్ సర్పంచ్ కె. వల్లీ ప్రసాద్, కూటమి నాయకులు చిటికెల రాము, బొర్రా కృష్ణ, కారే అప్పలరాజు, కాంగ్రెస్ నాయకులు కారే శ్రీనివాస్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కృష్ణ, కోశాధికారి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు తీరిన తాగునీటి సమస్య


టెంట్లువీధిలో కుళాయిలను ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్ కృష్ణవంశీ

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదవలస పంచాయతీ టెంట్లువీధి గిరిజనులకు తాగునీటి సమస్య పరిష్కారమైంది. వీరు కొన్నేళ్లుగా తాగునీటికి తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీంతో రూ. 3.5లక్షల పంచాయతీ నిధులతో గ్రామం లో రక్షిత నీటి పథకాన్ని నిర్మించారు. ఈ పథకాన్ని సర్పంచ్ కృష్ణవంశీ శనివారం ప్రారంభించారు. వైస్ ఎంపీపీ సప్పగెడ్డ ఆనంద్, ఉప సర్పంచ్ కాంతమ్మ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వారపు సంతలో విస్తృత వాహన తనిఖీలు


వాహన తనిఖీలు చేపడుతున్న పోలీసులు

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం జరిగిన వారపు సంతలో ఎస్ఐ జె.రామక్రిష్ణ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత వాహన తనిఖీలు చేపట్టారు. సంతకు జోలాపుట్టు, డుడుమ, కుమడ తదితర ప్రాంతాల నుంచి వచ్చి వెళ్లిన వాహనాలను, ప్రయాణికుల లగేజీలను క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. అనుమానితులను ప్రశ్నించి విడిచిపెట్టారు. వాహన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, అపరిచిత వ్యక్తులకు ఎవరూ ఆశ్రయం కల్పించరాదని, అనుమానాస్పదంగా ఎవరైనా సంచరించినట్లు తెలిస్తే తమకు సమాచారం అందించాలని అన్నారు. ప్రైవేటు వాహనాల్లో స్థాయికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, వాహన డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు.

మహిళపై కందిరీగల దాడి


చికిత్స పొందుతున్న గిరి మహిళ

డుంబ్రిగుడ, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోసంగి గ్రామానికి చెందిన గిరి మహిళ కందిరీగల దాడిలో గాయాలయ్యాయి. శనివారం మేకల ను మేతకు తీసుకువెళ్లిన ఆమెపై కందిరీగలు దాడి చేశాయి. తలపై గాయాలయ్యాయి.కుటుంబ సభ్యులు వెంటనే డుంబ్రిగుడ పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. వైద్యులు చికిత్స అందించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

'మెడికల్ కళాశాలకు మల్లుదొర పేరు పెట్టాలి'

సీలేరు, సెప్టెంబరు 13 , (ఆంధ్రజ్యోతి) : పాడేరులోని ప్రభుత్వ మెడికల్ కళాశాలకు గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు , విశాఖపట్నం తొలి పార్లమెంట్ సభ్యుడు శ్రీగాం మల్లుదొర పేరు పెట్టాలని కాంగ్రెస్ నాయకుడు కారే శ్రీనివాస్ కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మచిలీపట్నంలోని ప్రభుత్వ వైద్య కళాశాలకు స్వాతంత్ర్య సమరయోధుడు పింగళి వెంకయ్య పేరును నామకరణం చేసిందని, ఏలూరులోని వైద్య కళాశాలకు ప్రఖ్యాత బయోకెమిస్ట్ యల్లాప్రగడ సుబ్బారావు పేరును ప్రకటించారన్నారు. ఇదే విధంగా మల్లుదొర దేశ భక్తిని భవిష్యత్తు తరాలు గుర్తుంచుకునేలా పాడేరు ప్రభుత్వ వైద్య కళాశాలకు ఆయన పేరు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

అన్న సమారాధన


భోజనాలు వడ్డిస్తున్న దృశ్యం

చింతపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాలయం వీధిలో శుక్రవారం అన్న సమారాధన నిర్వహించారు. వినాయక చవితి ముగింపు ఉత్సవాల్లో భాగంగా స్థానిక భక్తులు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు దారలక్ష్మి పద్మ, పాల్గొన్నారు.

వలస కూలీలకు దుస్తులు, రగ్గులు వితరణ


వాహన తనిఖీలు చేపడుతున్న పోలీసులు

చింతపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నిర్మాణంలో పనిచేస్తున్న వలస కూలీలకు స్థానిక ఏరియా ఆస్పత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మావతి దుస్తులు, రగ్గులు పంపిణీ చేశారు. ఆమె వ్యక్తిగత నిధులతో కొంత కాలంగా పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శనివారం చిన్నగెడ్డలో నివాసం ఉంటున్న ఉత్తరాదిక చెందిన వలస కూలీలకు అవసరమైన రగ్గులు, మహిళలకు దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు సహాయపడడంలో సంతృప్తి ఉంటుందని, రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆమె తెలిపారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం: సీఐటీయూ



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

చింతపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పోరాటాలతోనే కార్మికుల సమస్యలు పరిష్కారం సాధ్యమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ప్రజాసంఘాల సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులంతా ఒకే తాటిపై నడవాలన్నారు. ఐక్యతగా పోరాటం చేస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పోరాటంతో సమస్యలు పరిష్కారమయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి గుడూతూరి సత్యనారాయణ, సంఘం నాయకులు సాగిన చిరంజీవి, పెంటమ్మ, వెంకటి, లక్ష్మి పాల్గొన్నారు.


హుకుంపేట రోడ్డు ఇరువైపులా ఆక్రమించి నిర్మించిన షెడ్లు


ట్రాఫిక్ సమస్య (ఫైల్)

హుకుంపేటలో అడుగడుగునా ట్రాఫిక్ సమస్యలు

» ప్రధాన రహదారికి ఇరువైపులా ఆక్రమణలు

» తొలగింపులో యంత్రాంగం నిర్లక్ష్యం

హుకుంపేట సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రధానరోడ్డు ఇరువైపులా షెడ్ల ఆక్రమ నిర్మాణాలు చేపట్టడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఈ మార్గం ప్రధానం కావడంతో వాహనాల రద్దీ ఉంటుంది. అయితే, రహదారికి ఇరువైపులా దుకాణాలు నిర్మాణాలు తొలగింపులో రెవెన్యూ, సంబంధిత రహదారి అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనచోదకులు , ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రెవెన్యూ అధికారులు దుకాణదారులకు నోటీసులు ఇచ్చి తమ కార్యాలయంనుంచి పిలిచి చర్చించారు. ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. అయితే, ఎవరూ దుకాణాలు తొలగించలేదు. రెవెన్యూ అధికారులు పట్టించుకోకుండా వదిలేశారు.

దీంతో స్థలాలను ఆక్రమించి మరిన్ని షెడ్లు నిర్మిస్తున్నారు. గ్రామంలోని ఖాళీ స్థలాలు రాత్రిరాత్రికి ఆక్రమణలకు లోనవుతున్నాయి. స్థానిక నేతలు వీరికి వత్తాసు పలుకుతున్నారు. ఆక్రమణలతో రహదారి ఇరుకుగా మారి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యారనే విమర్శలు వినిపిస్తున్నారు. తహశీల్దార్ పర్యవేక్షణ లోపంతో ఈ దుస్థితి నెలకొంటున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పచ్చపచ్చగా..


కరకవలస రోడ్డుకు ఆనుకుని కళకళలాడుతున్న పంటపొలాలు

అనంతగిరి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరకు-విశాఖ ప్రధాన రహదారి డముకు, కరకవలస సమీపంలో పచ్చని పంటపొలాలు కనువిందు చేస్తున్నాయి. వర్షాలతో పంటపొలాలు కళకళలాడుతున్నాయి. మధ్యలో ఏటవాలుగా కొండదిగువకు రహదారి మరింత అందాన్నిస్తోంది. అటువైపుగా వెళ్తున్న పర్యాటకులు, స్థానికులు, ఇతర వాహన చోదకులు ఈ దృశ్యాలను సెల్‌ఫోన్లలో బంధిస్తున్నారు.

అతిథి గృహం అదిరింది

▸ సుందరంగా నిర్మించిన పీఆర్ విభాగం ▸ విశాలవంతమైన వీవీపీ సూట్‌లు, మీటింగ్ హాల్ ▸ స్పీకర్ క్యాంప్ కార్యాలయంగా ఉపయోగించే అవకాశం



నర్సీపట్నంలో సుందరంగా నిర్మించిన పంచాయతీరాజ్ అతిథి గృహం

నర్సీపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సకల సదుపాయాలు, హంగులతో పంచాయతీరాజ్ అతిథి గృహం కొంగొత్త అందాలను సంతరించుకుంది. వీఐపీ సూట్ రూమ్స్, విశాల వంతమైన మీంటింగ్ హాల్, వెయిటింగ్ హాల్ నిర్మాణం చేపట్టారు. 2018లో గత టీడీపీ ప్రభుత్వంలోనే స్పీకర్ అయ్యన్నపాత్రుడు రూ. రెండు కోట్ల అంచనాలతో మండల పరిషత్ కార్యాలయ భవనం వెనుక పంచాయతీరాజ్ అతిథి గృహం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కొంత వరకు పనులు పూర్తి చేశాక ఇంతలో ఎన్నికలు రావడం, వైసీపీ అధికారంలోకి రావడం తెలిసిందే. అయితే నాటి ప్రభుత్వం దీనిని పట్టించుకోకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన అసంపూర్తిగా నిలిచిపోయింది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత స్పీకర్ అయ్యన్నపాత్రుడు చొరవతో మళ్లీ పనులను ప్రారంభించారు. దీనిని స్పీకర్ క్యాంప్ కార్యాలయంగా వినియోగించే అవకాశం ఉండడంతో అధికారులు శరవేగంగా పనులను పూర్తి చేశారు. పదేళ్ల క్రితం వరకు జిల్లా అధికారులు వస్తే ఇక్కడ ఆర్అండ్‌బీ అతిథి గృహం ఒక్కటే ఉపయోగ పడేది. ఇప్పుడు ఒక వీవీఐపీ సూట్‌తో పాటు మూడు వీఐపీ సూట్ రూమ్‌లతో ఆధునిక సౌకర్యాలతో పంచాయతీరాజ్ అతిథి గృహాన్ని సిద్ధం చేశారు. జిల్లా స్థాయి అధికారులు పర్యటనలకు వచ్చినప్పుడు ఉపయోగడే విధంగా దీనిని తీర్చిదిద్దారు. అధికారులు సమీక్షా సమావేశాలు నిర్వహించుకునేందుకు వీలుగా విశాలవంతమైన హాల్ నిర్మాణం చేయడంతో పాటు ఎల్ఈడీ స్క్రీన్, ప్రొజెక్టర్, స్పీకర్లు ఏర్పాటు చేశారు. పెద్ద వెయింటింగ్ హాల్ కూడా నిర్మాణం ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఈ అతిథి గృహాన్ని అంతా ఆసక్తిగా తిలకిస్తున్నారు.




అతిథి గృహంలో వీవీపీ సూట్ రూమ్, విశాలవంతమైన మీటింగ్ హాల్

'యూరియా కోసం ఆందోళన వద్దు'



చీడిగుమ్మలలో యూరియాను పంపిణీ చేస్తున్న నాయకులు

గొలుగొండ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : యూరియా పంపిణీని శనివారం పలు గ్రామాల్లో చేపట్టారు. చీడిగుమ్మల రైతు భరోసా కేంద్రంలో సొసైటీ అధ్యక్షుడు భీమిరెడ్డి సత్యనారాయణ, జోగంపేటలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, నాయకులు సుర్ల బాబ్జీ యూరియాను రైతులకు అందజేవారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ యూరియా కోసం రైతులెవరూ ఆందోళన చెందవద్దన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. ప్రభుత్వం రైతులకు అవసరమయ్యే యూరియాను దఫదఫాలు అందిస్తుందని వివరించారు.

250 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు



వైద్య శిబిరంలో పరీక్షలు జరుపుతున్న వైద్య సిబ్బంది

నర్సీపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఇక్కడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కిమ్స్ ఐకాన్ సౌజన్యంలో ఏర్పాటైన ఈ శిబిరాన్ని డీఎస్పీ శ్రీనివాసరావు ప్రారంభించి మాట్లాడారు. ఇటువంటి శిబిరాలను తరచూ నిర్వహించడం ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించ వచ్చునన్నారు. అనంతరం 250 మందికిపైగా పట్టణ ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. సాధారణ వైద్యం, మూత్ర పిండాలు, గుండె, నేత్ర వైద్య పరీక్షలు ఉచితంగా చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీనాథ్, మండల శాఖ అధ్యక్షుడు అడిగర్ల వరహాలనాయుడు, కార్యదర్శి జీవీ రమేశ్, కురచా రమణ తదితరులు పాల్గొన్నారు.

నాతవరం స్టేషన్‌కు కృష్ణాదేవిపేట ఎస్ఐ బదిలీ



తారకేశ్వరరావు

కృష్ణాదేవిపేట/నాతవరం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి) : గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట ఎస్ఐ వై.తారకేశ్వరరావును జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా నాతవరం పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఇక్కడ ఏడాది పాటు విధులు నిర్వహించిన ఆయన స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో ఎందరో నిరుద్యోగులకు ఉచితంగా కోచింగ్, విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ ఇచ్చేవారు. ఇదిలావుంటే, నాతవరం ఎస్ఐగా తారకేశ్వరరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలను అందజేసి స్వాగతం పలికారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో ఉన్న సిహెచ్. భీమరాజును జిల్లా హెడ్ క్వార్టర్ అనకాపల్లి వీఆర్‌కు ఉన్నతాధికారులు పంపారు.

వేములపూడి బీసీ బాలికల వసతి గృహాన్ని సందర్శించిన అధికారులు

▸ విద్యార్థిని మృతితో అప్రమత్తం ▸ వైద్య శిబిరం ఏర్పాటు చేసి అందరికీ పరీక్షలు ▸ హాసిని తల్లిదండ్రులను పరామర్శించిన ప్రజా సంఘాలు



విద్యార్థినులనుద్దేశించి మాట్లాడుతున్న ఎంఈవో తలుపులు

నర్సీపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేములపూడి బీసీ బాలికల వసతి గృహాన్ని పలువురు అధికారులు శనివారం సందర్శించారు. వసతి గృహంలోని ఎనిమిదో తరగతి చదవుతున్న విద్యార్థిని హాసిని శుక్రవారం కడుపు నొప్పితో చనిపోయిన విషయం తెలిసిందే. దీంతో తొలుత ఎంఈవో తలుపులు విచ్చేసి విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడారు. ఎటువంటి అనారోగ్య సమస్యలున్నా భయపడకుండా వార్డెన్ దృష్టికి తీసుకు వెళితే ఆస్పత్రిలో చూపిస్తారన్నారు. ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఇదిలావుంటే, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జ్యోతి వసతి గృహంలో ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేయించారు. బీసీ సంక్షేమ శాఖ డీడీ కె.శ్రీదేవి వసతి గృహాన్నిన సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఆహారం, తాగునీరు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని వార్డెన్‌కు ఆదేశించారు.

సకాలంలో వైద్యం అంది ఉంటే మా బిడ్డ బతికుండేది : మృతురాలి తల్లి

మాకవరపాలెం : సకాలంలో విద్యార్థిని హాసినికి వైద్యం అందించి ఉంటే బతికి ఉండేదని ఎస్ఎఫ్ఐ, ఐద్వా, సీఐటీయూ ప్రతినిధులు అన్నారు. మండలంలోని బూరుగుపాలెంలో హాసిని తల్లిదండ్రులను శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వీరితో విద్యార్థిని తల్లి నాగమణి మాట్లాడుతూ వేములపూడి వసతి గృహంలో ఇద్దరు పిల్లలను పదవిస్తున్నామన్నారు. అయితే పెద్ద కూతురు హాసిని కడుపు నొప్పితో బాధపడుతుందని సిబ్బందికి తెలియజేశామన్నారు. ఓఆర్ఎస్ పట్టి తగ్గిపోయియిందని చెప్పారని ఆమె తెలిపింది. అమ్మకు ఫోన్ చేయండని హాసిని చెప్పినా తగ్గిపోతుందని మా చిన్న కుమార్తెకు చెప్పారన్నారు. హాస్టల్ వార్డెన్, సిబ్బంది ఎవరూ తమకు ఏ విషయం చెప్పలేదని ఆమె తెలిపింది. కనీసం ఆ రాత్రి ఆసుపత్రికి తీసుకు వెళ్లినా తమ కుమార్తె మరణించి ఉండేది కాదని కన్నీరుమున్నీరుగా విలపించింది. శుక్రవారం ఉదయం మీ అమ్మాయికి బాగోలేదని ఫోన్ చేశారని, అయితే పరిస్థితి అప్పటికే చేయిదాటిపోయిందని వాపోయింది. ఈ ఘటనపై కలెక్టర్ స్వయంగా బహిరంగ విచారణ జరపాలని ప్రజా సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఎస్ఐఫ్ఐ ప్రతినిధులు పి.విజయ్‌కుమార్, ఎం.సత్యనారాయణ, జనార్థన్, మణి, మోహన్, ఐద్వా జిల్లా ట్రెజరర్ సూర్య ప్రభ తదితరులు పాల్గొన్నారు.



హాసిని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ప్రజా సంఘాల ప్రతినిధులు

పరారీలో ఉన్న గంజాయి నిందితుడి అరెస్ట్

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఏళ్లతరబడి పరారీలో ఉన్న గంజాయి నిందితుడ్ని గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి శనివారం వారు తెలిపిన వివరాలివి. కృష్ణాదేవిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనంతో గంజాయి పట్టుబడగా ఆ కేసులో నిందితుడుగా ఉన్న కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన మురబోయిన వెంకట దినేష్ సాత్విక్ అప్పటి నుంచి పరారీలో ఉన్నాడన్నారు. కృష్ణాదేవిపేట శివారులో శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టగా అతడు పట్టుబడినట్టు చెప్పారు. ఈ మేరకు న్యాయమూర్తి రిమాండ్ విధించినట్టు చెప్పారు. .

గ్రామాల్లో రేషన్ స్మార్టు కార్డులు పంపిణీ

గొలుగొండ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలుగ్రామాల్లో శనివారం రేషన్ స్మార్టుకార్డుల పంపిణీ చేపట్టారు. శ్రీరాం పురం తదితర గ్రామాల్లోని రేషన్ డిపోల్లో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, నాయకులు రాయపురెడ్డి జమీలు, రాంబాబు పం పిణీ చేశారు. ఈ సందర్భంగా అడిగర్ల మాట్లాడుతూ రేషన్ సరకులను పారదర్శకంగా అందించేందుకే రాష్ట్ర ప్రభుత్వం క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్టు కార్డులను పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. డిపోల్లో 25 రోజుల పాటు సరకులు పంపిణీకి చర్యలు చేపట్టిందన్నారు. ఈ కార్య క్రమంలో నాయకులు పుల్లేటికుర్తి రమేష్, ఆర్.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'సీతారాం ఏచూరి స్ఫూర్తితో ప్రజా పోరాటాలు'

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : దివంగత సీపీఎం నేత సీతారాం ఏచూరి స్ఫూర్తితో ప్రజా పోరాటాలు సాగించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఇక్కడి సీఐటీయూ కార్యాలయంలో ఏచూరి ప్రథమ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మితవాద శక్తుల ప్రాబల్యం పెరుగుతున్న నేపథ్యంలో వాటిని ఎదుర్కొనేందుకు సీతారాం ఏచూరి స్ఫూర్తితో ప్రజా పోరాటాలు సాగించాలన్నారు. కార్మిక, కర్షకుల హక్కుల సాధనకు తుదిశ్వాస వరకు పోరాడారని కొనియాడారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గంటా శ్రీరామ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రుత్తల శంకరరావు, శ్రీనివాసరావు, ఈశ్వరరావు, తేలయ్యబాబు, సుభాషిణి పాల్గొన్నారు.

12 అడుగుల గిరినాగు పట్టివేత



రైవాడ జాలాశయం వద్ద గిరి నాగును పట్టుకున్న స్నేక్ క్యాచర్

దేవరాపల్లి, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి): రైవాడ జలాశయం వద్ద 12 అడుగుల గిరినాగుని స్నేక్ క్యాచర్ శనివారం సాయంత్రం పట్టుకున్నారు. అనంతరం దట్టమైన అటవీ ప్రాంతంలో విడిచి పెట్టారు. జలాశయం గట్టు లోపల రాళ్ల పేర్పు సందులో గిరినాగు చేరినట్లు పర్యాటకులు గుర్తించారు. వెంటనే స్నేక్ క్యాచర్ కృష్ణకు సమాచారం అందించారు. అందుబాటులో లేక పోవడంతో వన్య ప్రాణుల సంరక్షణ సమితి సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి రాళ్లలో ఉన్న గిరినాగును పట్టుకునిదట్టమైన అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘ జిల్లా అధ్యక్షుడిగా దాలినాయుడు



దాలినాయుడును అభినందిస్తున్న కార్యదర్శులు

రావికమతం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిలా పంచాయతీ కార్యదర్శుల సంఘ అధ్యక్షుడిగా మండలంలోని మేడివాడ పంచాయతీ కార్యదర్శి పి.దాలినాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనకాపల్లిలో శనివారం ఏపీ ఎన్‌జీవో విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు కె.ఈశ్వరావు, జిల్లా జనరల్ సెక్రటరీ ఆర్. రవిశంకర్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. వీటిలో అనకాపల్లి జిల్లా పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య అధ్యక్షుడిగా పి. దాలినాయుడు,ఉపాధ్యక్షులుగా ఎ. దిలీప్‌కుమార్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా అనంత ఉమాదేవి, ప్రధాన కార్యదర్శిగా కరణం నాగేశ్వరావు, సంయుక్త కార్యదర్శిగా కె.సూర్యకళ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బి.చిన్నోడు, ట్రెజరర్‌గా ఆర్.పి నాయుడు, సంయుక్త ట్రెజరర్‌గా ఎన్.సత్తానియల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

లక్ష్మీపురంలో అన్న సమారాధన



కార్యక్రమాన్ని ప్రారంభించిన గవర కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్

చోడవరం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వినాయకచవితి ఉత్సవాలలో భాగంగా శనివారం మండలంలోని లక్ష్మీపురంలో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ నాగగంగాధర్ పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు సిరిసోళ్ల సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

పెద్దేరు నుంచి 400 క్యూసెక్కుల విడుదల

మాడుగుల రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దేరు జలాశయానికి వరద తాకిడి పెరిగింది. జలాశయ గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు. కాగా శనివారం సాయంత్రానికి 518 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో 136.60 మీటర్లకి చేరింది. ఈ క్రమంలో మరింత పెరిగే అవకాశం ఉన్నందున రాత్రి 8 గంటలకు మూడో గేటు తెరిచి 400 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెడుతున్నామని జలాశయం ఏఈ సుధాకర్ రెడ్డి తెలిపారు. నది పరిసర ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.



మాడుగుల ఆర్‌బీకేకి చేరిన యూరియా బస్తాలు



టోకెన్ల కోసం నిరీక్షిస్తున్న రైతులు

యూరియా అక్కడ అలా.. ఇక్కడ ఇలా...

▸ పంపిణీలో జాప్యంతో సమస్య...

▸ మాడుగులకు 94.14 మెట్రిక్ టన్నులు సరఫరా

మాడుగుల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో రైతు భరోసా కేంద్రాలకు 94.14 మెట్రిక్ టన్నులు (2092) యూరియా బస్తాలు సరఫరా అయ్యాయి. దీంట్లో మాడుగులకు 12.51 మెట్రిక్ టన్నులు (278) బస్తాలు, పొంగళిపాక ఆర్‌బీకేకి 11 మెట్రిక్ టన్నులు, గొటివాడ అగ్రహారం ఆర్‌బీకేకి 11 మెట్రిక్ టన్నులు, జేడీ పేటకు 11 మెట్రిక్ టన్నులు, ఎం.కోడూరుకు 12.5 మెట్రిక్ టన్నులు, ఎం.కోటపాడు 12.5, సత్యవరంనకు 12.5 మెట్రిక్ టన్నుల యూరియాకేటాయించారు. ఈ యూరియాను ఆయా రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు పంపిణీ చేయనున్నట్టు వ్యవసాయాధికారి ఎం. అనసూయ తెలిపారు.

టోకెన్లకోసం నిరీక్షణ ..

ఖరీఫ్ రైతులు యూరియా కోసం టోకెన్‌లను పొందేందుకు రైతులు ఆయా ఆర్‌బీకే కేంద్రాల వద్ద పడిగాపులు కాశారు. నాయకులు అత్యుత్సాహం ప్రదర్శించి, యూరియా రైతు భరోసా కేంద్రంలో ఉందంటూ పలు గ్రూపులలో పోస్టులను పెట్టారు. ఈ సమాచారంతో రైతులకు శనివారం మండల కేంద్రానికి చేరుకున్నారు. అయితే, ఉదయం 11గంటల తరువాత టోకెన్స్ ఇచ్చి సోమవారం యూరియా ఇస్తామని చెప్పారు. దీంతో రైతులు అసహనం వ్యక్తంచేశారు.

రైతు సేవా కేంద్రాలకు యూరియా సరఫరా...

మాడుగుల రూరల్: మండలంలోని పలు రైతు సేవాకేంద్రాలకు యూరియా ఎరువు సరఫరా చేసినట్లు ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. మాడుగుల -1 రైతు సేవా కేంద్రానికి 12.510మెట్రిక్ టన్నులు, ఎం.కోటపాడు ఆర్ఎస్‌కేకి 12.510 మెట్రిక్ టన్నులు, సత్యవరానికి 12.510 మెట్రిక్ టన్నులు, పొంగలిపాక ఆర్ఎస్‌కేకు 11.025 మెట్రిక్ టన్నులు , ఒమ్మలి ఆర్ఎస్‌కేకు 11.025 మెట్రిక్ టన్నులు, గొటివాడ అగ్రహారం ఆర్ఎస్‌కేకు 11.025 మెట్రిక్ టన్నులు, జమ్మాదేవిపేట ఆర్ఎస్‌కేకు 11.025 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశామని చెప్పారు. రైతులు యూరియా తీసుకోవాలని ఎంపీడీవో సూచించారు.

రత్నంపేటలో యూరియా పంపిణీ

రోలుగుంట: మండలంలోని రత్నంపేటలో శనివారం రైతు సేవా కేంద్రం వద్ద యూరియా పంపిణీని పునఃప్రారంభించారు. ఈ కేంద్రానికి 10 టన్నుల యూరియాను కేటాయించినట్లు ఏవో చిరంజీవి పేర్కొన్నారు.

'విద్యార్థీ మేలుకో ..'

బుచ్చెయ్యపేట సెప్టెంబరు 13 (ఆంధ్ర జ్యోతి): మండలంలో దిబ్బిడి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శనివారం విద్యార్థి మేలుకో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గణిత ఉపాధ్యాయుడు ఏవీఎస్ మూర్తి 30 మంది పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్యార్థులు స్కూల్‌కు సరిగా హాజరు కాకపోవడంపై ఆరా తీశారు. ఇకపై తప్పకుండా స్కూల్‌కు పంపాలని తల్లిదండ్రులకు సూచించారు. స్కూల్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కె.సత్యారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తల్లి తండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు

రైవాడ జలాశయ పంట కాలువలో చనిపోయిన కోళ్లు

▸ కోళ్ల ఫారం యజమానులు పడేయడంపై స్థానికులు ఆగ్రహం



చేనులపాలెం సమీపంలో కాలువలో చనిపోయిన కోళ్లు



కోళ్లను పరిశీలిస్తున్న పశు వైద్యాధికారులు

దేవరాపల్లి, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారేపల్లి శివారు చేనులపాలెం సమీపంలో రైవాడ జలాశయం నుంచి ఆయకట్టుకు సరఫరా చేస్తున్న కాలువ చిననందిపల్లికి వెళ్లే రహదారిలో మృతి చెందిన వందలాది బ్రాయలర్ కోళ్లను పడేశారు. దీంతో గుట్టలుగా కొన్ని నీటిలో తేలియాడుతూ మరికొన్ని దర్శనమిస్తున్నాయి. వీటి వల్ల పరిసరవాసులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఈ కాలువ నుంచి ప్రవహించే నీరు పశువులు తాగడానికి, ఇతరత్రా వియోగిస్తారు. చనిపోయిన కోళ్లు వేయడంతో దుర్వాసనతో ఇబ్బందులు తలెత్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. కోళ్ల ఫారం యజమానులు ఇలా మృతి చెందిన కోళ్లను ఇలా నీటి వేయడంపై విమర్శలు తలెత్తుతున్నాయి. సంబంధిత వీఆర్‌వోకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆప్రాంత వాసులు ఆరోపిస్తున్నారు. చనిపోయిన కోళ్లను కుక్కలు చిందరవందర చేస్తున్నాయి. వీధుల్లోకి లాక్కువస్తున్నాయి. నిబంధనలు ప్రకారం చనిపోయిన కోళ్లను గొయ్యి తీసి పూడ్చి వేయాలని, ఇలా కాలువలో వేయడంతో అనేక అనర్థాలకు దారి తీస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పశు వైద్యాధికారుల పరిశీలన

మండల పశు వైద్యాధికారులు గాయత్రీదేవి, మంజుషారాణి, ప్రియాంక శనివారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వ్యాధులతో చనిపోయిన కోళ్లను మూడునాలుగు అడుగుల గోతిలో పూడ్చాలన్నారు. పూడ్చే ముందు వాటిపై సున్నం, లేదా బ్లీచింగ్ చల్లి మట్టితో పూడ్చి వేయాలన్నారు. ఇలా చనిపోయిన కోళ్ల బహిరంగంగా వేయరాదన్నారు. చేపల చెరువులతో పాటు కాలువల్లో చని పోయిన కోళ్లు, వ్యర్థాలను వేసి కాలుష్యం చేస్తున్న పౌల్ట్రీ యజమానులపై చర్యలు తీసుకోవాలని సీపీ ఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న జడ్పీటీసీ సభ్యుడు రాంబాబు

బుచ్చెయ్యపేట సెప్టెంబరు 13 (ఆంధ్ర జ్యోతి): మండలంలో తురకలపూడిలో శనివారం అభివృద్ధి పనులకు జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు శంకుస్థాపన చేశారు. 20 లక్షలతో శ్మశానం చుట్టూ ప్రహరీ, 20 లక్షలతో ఆర్‌టీ రోడ్డు నుండి రెల్లి కాలనీ వరకు సీసీ రోడ్డు నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో వసతుల కల్పనకు నిధులు వెచ్చిస్తున్నామన్నారు. జడ్పీ గ్రాంట్ నుంచి 300 వరకు తాగునీటి బోర్లు వేసినట్టు చెప్పారు. కార్యక్రమమలో సర్పంచ్ వై గోవింద, ఉప సర్పంచ్ అప్పలనాయుడు, కోరుకొండ అప్పలనాయుడు, ఉల్లింగ రాజారావు, అక్కిరెడ్డి నర్సింగ్ ,అర్జున, అమ్మినాయుడు, సర్పంచ్‌లు ముచ్చకర్ల శ్రీను,గొపిశెట్టి శ్రీనివాసరావు, ఇందల కోటేశ్వరరావు, జి.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల లీజుదారులకు నోటీసులు

రావికమతం,సెప్టెంబరు13,(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ ఆధీనంలో కొత్తకోటలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లోని దుకాణాలను లీజు దారులు మాత్రమే ఉపయోగించుకోవాలని, వేరొకరికి ఇవ్వరాదని స్థానిక ఎంపీడీవో సీతారామ స్వామి ఆదేశించారు. కొత్తకోటలో మండల పరిషత్ ఆధీనంలో 16 షాపులకు గాను ఎనిమిది షాపులు తమనుంచి అద్దెకు తీసుకున్న వారు ఇతరులకు అద్దెకిచ్చినట్లు మండల సమావేశంలో స్థానిక ఎంపీటీసీ సభ్యుడు పూడి దేవా ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి నిర్వహించిన విచారణ ఈ విషయం వాస్తవమేనని తేలిందన్నారు. ఈ మేరకు సంబంధిత ఎనిమిది షాపుల లీజు దారులకు నోటీసులు జారీ చేశామన్నారు. వారు తక్షణం అద్దె బకాయిలు చెల్లించి షాపులను ఖాళీ చేయాలని పంచాయతీ కార్యదర్శి జ్యోతిశ్వరెడ్డి ద్వారా నోటీసులు ఇచ్చినట్టు ఎంపీడీవో పేర్కొన్నారు.

వైద్యాధికారికి సన్మానం

బుచ్చెయ్యపేట సెప్టెంబరు 13 (ఆంధ్ర జ్యోతి): జిల్లా స్థా యిలో ఉత్తమ అవార్డు అందుకున్న మండలంలోని తురకలపూడి వైద్యాధికారిణి సంధ్యారాణిని జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామంలో వైద్య సేలందిస్తూ అవార్డులు పొందడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వై గోవింద, ఉప సర్పంచ్ అప్పలనాయుడు, నేతలు కోరుకొండ అప్పలనాయుడు, ఉల్లింగ రాజారావు, సర్పంచ్‌లు ముచ్చకర్ల శ్రీను,గొపిశెట్టి శ్రీనివాసరావు,ఇందల కోటేశ్వరరావు, జి.ఆనంద్ తదితరులున్నారు.

కేజీహెచ్‌లో క్యాన్సర్‌కు అత్యాధునిక వైద్యం




విశాఖపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి):

గత కొన్నాళ్లుగా క్యాన్సర్ బారినపడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. క్యాన్సర్ రోగులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోంది. ఈ క్రమంలోనే రాష్ట్రంలోని అనేక ప్రభుత్వ ఆస్పత్రులకు అత్యాధునిక చికిత్స పరికరాలను సమకూర్చింది. ఇందులో భాగంగానే సుమారు రూ.45 కోట్ల విలువ చేసే పరికరాలను కొద్దిరోజుల కిందట కేజీహెచ్‌కు మంజూరు చేయగా, మంత్రి సత్యకుమార్ యాదవ్ వాటిని ప్రారంభించారు. ఇప్పటికే ఈ పరికరాలపై చికిత్సను రేడియేషన్ అంకాలజీ డిపార్ట్‌మెంట్ వైద్యులు ప్రారంభించారు. ఈ విభాగానికి రాష్ట్ర ప్రభుత్వం అందించిన పరికరాల జాబితాలో సిటీ సిములేటర్, లీనియర్ యాక్సిలిరేటర్, హెచ్‌డీఆర్ బ్రాకీ థెరపీ వంటి పరికరాలు ఉన్నాయి. ఇవి క్యాన్సర్ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఎలా ఉపయోగపడతాయి, రోగులకు ఎలా మేలు చేకూరుతుందనే అంశాలపై 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

ఆధునిక నూతన పరికరాలు రావడంతో రోగులకు ఎంతో మేలు

- రూ.45 కోట్లతో సిటీ సిములేటర్, లీనియర్ యాక్సిలిరేటర్, హెచ్‌డీ బ్రాకీ థెరపీ పరికరాలను సమకూర్చిన రాష్ట్ర ప్రభుత్వం
- నేరుగా క్యాన్సర్ కణాలకు చికిత్స అందించే టెక్నాలజీ అందుబాటులోకి..

సీటీ సిములేటర్



రాష్ట్ర ప్రభుత్వం కేజీహెచ్‌కు అందించిన పరికరాల్లో ఇదొకటి. దీని ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలందించే అవకాశం ఉంది. రేడియేషన్ అవసరం అనుకునే రోగులకు దీనిద్వారా వైద్య సేవలందిస్తారు. మొదట రోగిని పరీక్షించేందుకు అనుగుణంగా పడుకోబెడతారు. మాస్క్ మాదిరిగా ఉండే దీనిలో రోగి స్థిరంగా ఉండేలా పడకోబెట్టిన తరువాత రోగి చుట్టూ తిరుగుతూ ఈ పరికరం స్కాన్ చేస్తుంది. ఈ స్కానింగ్ 0.5 మిల్లీమీటర్ల నుంచి మూడు నుంచి ఐదు మిల్లీమీటర్ల సామర్థ్యంతో స్కానింగ్ చేసి ఇమేజ్‌లు తీస్తుంది. ఈ ఇమేజ్‌లు ఇదే పరికరంలో ఉండే కంప్యూటర్ ట్రీట్‌మెంట్ ప్లానింగ్ సిస్టమ్‌లోకి వెళతాయి. అక్కడ ఆస్పత్రికి కణితులను క్షుణ్ణంగా పరిశీలించి సైజు బట్టి ఎంత రేడియేషన్ ఇవ్వాలన్న దానిని మౌస్‌తో వైద్య నిపుణులు డ్రా చేస్తారు. వీటిని పరిశీలించాక రేడియేషన్ ఫిజిస్ట్ ఎటువైపు నుంచి రేడియేషన్ ఎంత మోతాదులో ఇవ్వాలో నిర్ధారిస్తారు. తరువాత లీనియర్ మెషిన్‌లో ఉండే మరో కోన్‌బీమ్ సీటీ మరోసారి స్కాన్ చేస్తుంది. ముందు తీసిన ఇమేజ్‌లో మాదిరిగా కణితులు ఉన్నాయా... ఏమైనా మార్పులు ఉన్నాయా..? అన్నది నిర్ధారించుకున్నాక రేడియేషన్ ప్రక్రియను స్టార్ట్ చేస్తారు. దీనిని ఇమేజ్ గైడెడ్ రేడియో థెరపీ అంటారు. ఈ పరికరాన్ని మెదడు నుంచి కాలి వేలి వరకు చేసే వైద్యానికి వినియోగిస్తుంటారు.

లీనియర్ యాక్సిలిరేటర్

దీని ద్వారా అడ్వాన్స్‌డ్ రేడియేషన్ థెరపీని రోగులకు అందిస్తారు. గతంలో టెలీ కోబాల్ట్ 60 అనే మెషిన్‌పై రేడియేషన్ ఇచ్చేవారు. కానీ లీనాక్ మెషిన్ ద్వారా చిన్న ట్యూమర్లను ట్రీట్ చేసేందుకు అవకాశం ఉంటుంది. ఇప్పటివరకు వినియోగించిన టెలీ కోబాల్ట్ మెషిన్‌లో 5/5 సెంటీమీటర్ల సైజు కంటే పెద్దగా ఉండే కణితులకు (కణితులు లేకపోయినా రేడియేషన్ వెళ్లిపోయేది) రేడియేషన్ ఇచ్చేందుకు అవకాశం ఉండేది. అంటే.. క్యాన్సర్ కణితులు 1 మిల్లీమీటర్ సైజులో ఉన్నప్పటికీ చుట్టూ ఉండే అదనపు భాగాలకు రేడియేషన్ ఇవ్వాల్సిన పరిస్థితి వచ్చేది. కానీ ఈ పరికరం వల్ల అదనపు భాగాలకు రేడియేషన్ ఇచ్చే పరిస్థితి ఉండదు. వన్ పాయింట్‌గా క్యాన్సర్ కణాలు ఉన్న భాగానికి మాత్రమే 0.5 మిల్లీమీటర్ల సైజులో కూడా రేడియేషన్ ఇస్తారు. దీనివల్ల క్యాన్సర్ లేని భాగాలకు రేడియేషన్ వల్ల హాని కలిగించే పరిస్థితి రోగులకు ఉండదు. అన్ని రకాల క్యాన్సర్ రోగులకు వైద్య సేవలు అందించడంలో ఇది ఉపయోగపడుతుంది.



హెచ్‌డీఆర్ బ్రాకీ థెరపీ..

ఈ విధానంలో కూడా అడ్వాన్స్‌డ్ రేడియేషన్‌ను అందిస్తారు. గర్భసంచి ముఖద్వార, ప్రోస్టేట్ గ్రంధితోపాటు మరికొన్ని రకాల క్యాన్సర్లలో గడ్డలతోపాటు కింది, చుట్టుపక్కల భాగాల్లో వాపులు (లింపినోడ్స్) వస్తుంటాయి. ఇప్పటివరకు ఈ తరహా క్యాన్సర్ రోగులకు ఎల్‌డీఆర్ (లో డోస్ రేట్) రేడియేషన్‌ను అందిస్తూ వస్తుంటారు. అంటే.. రోగిని 18 గంటలపాటు ఒక గదిలో ఉంచి రేడియేషన్ ఇస్తుంటారు. దీనివల్ల రోగులకు తీవ్ర ఇబ్బందులుండేవి. అయితే హెచ్‌డీఆర్ (హై డోస్ రేట్)లో రేడియేషన్‌ను నేరుగా గడ్డ లోపలకు ఇస్తుంటారు. దీనికి పది నిమిషాల నుంచి అరగంట వరకు మాత్రమే సమయం పడుతుంది. రోగి వచ్చిన రోజే రేడియేషన్ తీసుకుని ఇంటికి వెళ్లిపోవచ్చు. దీనివల్ల రోగికి పెద్దగా ఇబ్బందులు ఉండవు.



రోగులకు అత్యాధునిక వైద్య సేవలు అందించే అవకాశం

-డాక్టర్ ఎం.శ్రీనివాస్, రేడియేషన్ అంకాలజీ విభాగాధిపతి, కేజీహెచ్



క్యాన్సర్ రోగులకు అత్యాధునిక వైద్య పద్ధతుల్లో చికిత్స అందించేందుకు అనుగుణమైన పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటికే ఈ పరికరాలపై చికిత్స ప్రారంభించాం. ఈ పరికరాల వల్ల రోగులకు సమయం ఆదా కావడంతో పాటు ఆరోగ్యానికి మేలు చేకూరుతుంది. ఇప్పటివరకు ఉన్న పరికరాలతో అందించే రేడియేషన్ వల్ల క్యాన్సర్ కణాలు లేని భాగాలకు ఇబ్బంది ఉండేది. ఇప్పుడలా కాకుండా క్యాన్సర్ కణజాలాలు ఉన్న భాగానికి మాత్రమే రేడియేషన్ ఇస్తున్నాం. అలాగే రేడియేషన్ ఎంత మోతాదులో ఇవ్వాలన్నది కూడా కంప్యూటరైజ్డ్ సిస్టమ్స్ ద్వారా నిర్ధారించి అందిస్తున్నాం. హెచ్‌డీఆర్ బ్రాకీ థెరపీతో నేరుగా క్యాన్సర్ గడ్డలోకే రేడియేషన్ పంపించే వెసులుబాటు కలుగుతోంది. దీనివల్ల రోగులకు గంటల తరబడి సమయం వృథా చేయాల్సిన అవసరం లేకుండా పోతోంది. ప్రస్తుతం క్యాన్సర్ రోగులకు వైద్య సేవలు అందించేందుకు అనుగుణంగా నలుగురు అంకాలజిస్టులు ఉన్నారు. అలాగే రేడియోలాజికల్ సేఫ్టీ ఆఫీసర్ ఒకరు, రేడియేషన్ ఫిజిస్ట్ ఒకరు అందుబాటులో ఉన్నారు. మరొకరు అందుబాటులోకి రానున్నారు. ప్రతి రోజూ పదుల సంఖ్యలో రోగులకు వైద్య సేవలందించేందుకు అవకాశం ఉంది.

చర్చనీయాంశమైన 'ఆంధ్రజ్యోతి' కథనం

అధిష్ఠానం దృష్టికి ఎంపీపీపై అవిశ్వాస వ్యవహారం

- ఐప్యాక్ ద్వారా సమాచారం
- కన్నబాబు రాజు గెస్ట్‌హౌస్‌లో వైసీపీ ఎంపీటీసీలతో సమావేశం
- హాజరైన వైసీపీ ఎలమంచిలి ఇన్‌చార్జి కరణం ధర్మశ్రీ
- ఎనిమిది మంది హాజరు, ఆరుగురు గైర్హాజరు
- గైర్హాజరైనవారిని సముదాయించడానికి యత్నాలు



అచ్యుతాపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి):

అచ్యుతాపురం ఎంపీపీపై అవిశ్వాసం రసకందాయంలో పడింది. శనివారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంతో వైసీపీలో కలకలం రేపింది. దీంతో వైసీపీ నేతలు ఎంపీటీసీ సభ్యులను సముదాయించే పనిలో పడ్డారు. ఎంపీపీ అవిశ్వాసంపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై ఐప్యాక్ బృందం ఆరా తీసింది. వాస్తవమని తేలడంతో పార్టీ అధిష్ఠానానికి పంపించింది. దీంతో చర్యలు ప్రారంభమయ్యాయి.

మండలంలో 21 మంది ఎంపీటీసీ సభ్యులకు 20 మంది వైసీపీకి చెందిన వారే ఉన్నారు. అయితే కూటమి ఎమ్మెల్యేగా సుందరపు విజయకుమార్ గెలవడంతో కొందరు వైసీపీ ఎంపీటీసీ సభ్యులు జనసేన, టీడీపీలోకి జంప్ అయ్యారు. ఎంపీపీ కోన సంధ్యపై అవిశ్వాసం పెట్టాలని అచ్యుతాపురం ఎంపీటీసీ సభ్యురాలు ద్వారపురెడ్డి వెంకటలక్ష్మి భర్త బాపూజీ ప్రయత్నాలు ప్రారంభించారు. దీనికి మండల వైస్ ఎంపీపీ వాసుపల్లి పద్మావతి, ఎంజేపురం ఎంపీటీసీ సభ్యురాలు రావి నాగలక్ష్మితోపాటు వైసీపీ నుంచి టీడీపీకి వచ్చిన ఒక ఎంపీటీసీ, జనసేనలో చేరిన ముగ్గురు ఎంపీటీసీ సభ్యులు వ్యతిరేకించారు. ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకురావడంతో వైసీపీ నాయకులు అప్రమత్తమయ్యారు. మాజీ ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు (కన్నబాబురాజు)కు కొండకర్ల ఆవ వద్ద గల గెస్ట్‌హౌస్‌లో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. కరణం ధర్మశ్రీ, బొడ్డేడ ప్రసాద్‌తోపాటు అచ్యుతాపురం మండల ముఖ్య నాయకులు హాజరయ్యారు. ఈ సమావేశానికి 14 మంది ఎంపీటీసీ సభ్యులు హాజరు కావలసి ఉండగా.. కేవలం ఎనిమిది మంది మాత్రమే హాజరైనట్టు తెలిసింది. అవిశ్వాసానికి సహకరిస్తే భారీ నజరానా ప్రకటించడంతో పాటు స్థానిక వైసీపీ నాయకుల పట్ల వ్యతిరేకత వల్లే ఆరుగురు గైర్హాజరయారని ప్రచారం జరుగుతోంది. కాగా సమావేశానికి హాజరైన ఎంపీటీసీ సభ్యులకు నజరానాలు అందినట్టు ప్రచారం జరుగుతోంది. గైర్హాజరైన వారిలో మార్టూరు, చోడపల్లి, హరిపాలెం, దిబ్బపాలెం-1, చీమలాపల్లి, ఆవసోమవారం ఎంపీటీసీ సభ్యులున్నారు. వీరిని దారికి తీసుకురావడానికి ఎంపీపీ భర్త కోన బుజ్జి, వైసీపీ మండల అధ్యక్షుడు దేశంశెట్టి శంకరరావు, జెడ్పీటీసీ సభ్యుడు లాలం రాంబాబు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

ప్రగతికి బాటలు

... 5వ పేజీ తరువాయి

మండలాలను కలుపుకుంటూ జరుగుతాయి.

పారిశ్రామిక రంగానికి ఎంతో మేలు

జాతీయ రహదారి విస్తరణ పనులతో జిల్లా పారిశ్రామిక హబ్‌గా అభివృద్ధి చెందనున్నది. వచ్చే ఏడాది జిల్లా పారిశ్రామిక వృద్ధి 46 శాతం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో చిన్న మధ్యతరగతి పరిశ్రమల పార్కు (ఎంఎస్ఎంఈ)లు ఏర్పాటు చేయనున్నారు. అలాగే నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కు, ఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్ ప్లాంటు రానున్నాయి. జాతీయ రహదారి విస్తరణ పనులు పూర్తయితే పారిశ్రామిక రంగానికి ఎంతో మేలు జరుగుతుంది.

సాగునీటి కాలువలకు మోక్షం

... 5వ పేజీ తరువాయి

గురించి కనీసం పట్టించుకోలేదు. అదే విధంగా గుంటపల్లి వద్ద గుంటపల్లి కాలువపై మదుము, తలుపులు శిథిలమయ్యాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మండల పరిషత్ నిధులు సుమారు 10 లక్షల రూపాయలతో గుంటపల్లి, మంగవరం వద్ద సాగునీటి కాలువలపై నూతనంగా మదుములు నిర్మించి మరో 5 లక్షల రూపాయలతో వాటికి తలుపులు అమర్చినట్టు మంగవరం కాలువ నీటి సంఘం అధ్యక్షుడు గూటూరు రామ గోవిందు తెలిపారు. సాగునీటి కాలువలకు మదుములు నిర్మించి తలుపులు ఏర్పాటు చేయడం, సాగునీటి కాలువలలో పూడికను తొలగించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దారి ఘోరం.. ప్రయాణం దుర్లభం

... 5వ పేజీ తరువాయి

కోటపాడు వెళ్లే రోడ్డు లోతట్టుగా మారింది. దీంతో వర్షపు నీరు రోడ్డుపై నిలిచిపోయి గోతులు ఏర్పడ్డాయి. ఈ మార్గంలో రోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో మరింత అధ్వానంగా తయారైంది. అదే విధంగా మలునాయుడుపాలెం గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా ఆర్అండ్‌బీ స్థలాలు ఆక్రమించుకొని కప్పేయడంతో వరద నీరు ప్రవహించే మార్గం లేక ఆ నీరు రోడ్డుపై ప్రవహించి పలు చోట్ల ధ్వంసమైంది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు, ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి పినగాడి-కె.కోటపాడు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని, రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు బీజేపీ సభ

... 5వ పేజీ తరువాయి

బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు ఈ వేదిక పై నుంచి పిలుపు ఇవ్వనున్నారు. రైల్వే మైదానంలో బహిరంగ సభ ఏర్పాట్లను శుక్రవారం పీవీఎన్ మాధవ్, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, జిల్లా అధ్యక్షులు పరశురామ్ తదితరులు పరిశీలించారు. ఈ సభలో కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ పాల్గొననున్నారు.

క్రైం... crime news

ప్రేమను నిరాకరించిందని యువకుడి ఆత్మహత్య


వంశీకృష్ణ (ఫైల్ ఫొటో)

పాడేరురూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రేమను నిరాకరించిందని మనస్తాపానికి గురైన యువకుడు మండలంలోని చింతలవీధి పంచాయతీ ఉబ్బేడిపుట్టు గ్రామ సమీపంలో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం వెలుగుచూసింది. ఇందుకు సంబంధించి ఎస్ఐ ఎల్.సురేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెదబయలు మండలం గంపరాయి పంచాయతీ అల్లంపుట్టు గ్రామానికి చెందిన మాసాడ కొండన్న, కాసులమ్మ కుమారుడు మాసాడ వంశీకృష్ణ (17) జి.మాడుగుల మండలంలోని ఏపీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ సీఈసీ చదివాడు. తర్వాత డిగ్రీలో చేరేందుకు దరఖాస్తు చేశాడు. ఇంటర్ విద్యను అభ్యసించే సమయంలో వంశీకృష్ణ జి.మాడుగుల మండలానికి చెందిన ఒక యువతిని ప్రేమించాడు. అయితే ఆ యువతి ప్రేమను నిరాకరించినట్టు తెలిసింది. దీంతో మనస్తాపానికి గురైన వంశీకృష్ణ 12వ తేదీన చింతలవీధి పంచాయతీ ఉబ్బేడిపుట్టు గ్రామంలోని తన మేనమామ పూజారి జానకిరావు ఇంటికి వెళ్లాడు. అదే రోజు ఉదయం 10 గంటల సమయంలో మేనమామ ఇంటి నుంచి బయటకు వెళ్లిన వంశీకృష్ణ తిరిగి ఇంటికి రాలేదు. ఉబ్బేడిపుట్టు గ్రామానికి చెందిన రేగం సింహాద్రి వ్యవసాయ పనులకు బయటకు వెళ్తున్న సమయంలో గ్రామ సమీపంలోని ఐటీడీఏ పెట్రోలు బంక్ వెనుక ఉన్న మద్దిచెట్టుకు యువకుడు ఉరేసుకొని ఉండడం గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. వారు మృతుడు వంశీకృష్ణగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎస్ఐ సురేష్ తెలిపారు.

చెన్నైలో కాశీపురం యువకుడి అనుమానాస్పద మృతి

- ప్రేమికురాలి బంధువులు హతమార్చి ఉంటారని తల్లిదండ్రులు ఆరోపణ


నవీన్ (ఫైల్ ఫొటో)

దేవరాపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశీపురానికి చెందిన డెక్క నవీన్(23) చెన్నైలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్నేహితులతో తీర్థయాత్రలకు వెళ్లి, తిరిగి వచ్చిన తన కుమారుడు మేడమీద నుంచి పడిపోయి చనిపోయాడంటూ ఓ యువతి ఫోన్ నుంచి మరో యువకుడు చెప్పడంపై నవీన్ తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కాశీపురానికి చెందిన నవీన్ కుటుంబం బతుకు తెరువు కోసం అచ్యుతాపురం మండలం పూడి గ్రామానికి మకాం మార్చారు. నవీన్ తండ్రి రాంబాబు అక్కడ ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ కుమారుడితోపాటు కుమార్తె రేష్మను చదివించారు. ఇంటర్, ఐటీఐ చదివిన నవీన్ అథ్లెటిక్స్‌లో జాతీయ స్థాయి క్రీడాకారుడిగా ఎదిగాడు. నవీన్ చదువుకొనే సమయంలో తనతో చదివిన అదే ప్రాంతానికి చెందిన యువతితో స్నేహం ఏర్పడింది. అది ప్రేమగా మారింది. ఆమె మరో రాష్ట్రంలో చదువుతుండగా నవీన్ రెండు నెలలు క్రితం తన కుటుంబం నివాసం ఉంటున్న ప్రాంతంలోని ఓ ప్రైవేటు కంపెనీలో చిరు ఉద్యోగంలో చేరాడు. తన స్నేహితులతో కలిసి తీర్థయాత్రలకు వెళుతున్నానంటూ నవీన్ తల్లికి చెప్పి ఈనెల 8వ తేదీ ఉదయం 5.30 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడు. బుధవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో అరుణాచలం గుడికి వెళ్లిన నవీన్ తన తల్లి విజయతో వీడియో కాల్‌లో మాట్లాడాడు. అదేరోజు రాత్రి 9.30 గంటలకు మాట్లాడాడని, చెన్నై వెళుతున్నామంటూ.. అందరి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నాడని ఆమె తెలిపింది. గురువారం ఉదయం తన కుమారుడు ప్రేమిస్తున్న యువతి ఫోన్‌తో వేరొక యువకుడు మాట్లాడుతూ నవీన్ మేడ మీద నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడంటూ ఫోన్ వచ్చిందని మృతుడి తల్లి విజయ భోరున విలపించింది. తన కుమారుడుతో ఇబ్బంది ఉంటే మందలించాలని, కనీసం తమకు ఎటువంటి విషయాలు తెలియ జేయకుండా ఇలా చేయడం అన్యాయమని తల్లి విజయ ఆవేదన వ్యక్తం చేసింది. తమ కుమారుడు ప్రేమించిన యువతితోపాటు బంధువులు పథకం ప్రకారం హత్య చేశారని తల్లిదండ్రులు రాంబాబు, విజయ, చెల్లెలు రేష్మ ఆరోపించారు. తమ కుమారుడు హత్య చేసుకొన్నంత పిరికివాడు కాదని వారు పేర్కొన్నారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తమకు న్యాయం జరిగేంత వరకు న్యాయ పోరాటం చేస్తామన్నారు.

మత్స్యగెడ్డలో యువకుడి గల్లంతు


నర్సింగ్ (ఫైల్‌ఫొటో)

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మత్స్యగెడ్డలో చేపల వేటకు వెళ్లిన గిరిజన యువకుడు గల్లంతైన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండలంలోని వనుగుమ్మ పంచాయతీ దొమినిపుట్టు గ్రామానికి చెందిన కిల్లో నర్సింగ్ (28) ఈనెల పదో తేదీన ఇంటిలో చెప్పకుండా చేపల వేటకు వెళ్లాడు. ఇంటిలో భార్య రాధిక భర్త పక్క గ్రామానికి వెళ్లి ఉండాడని భావించింది. రాత్రి 9 గంటలు అయినా ఇంటికి రాకపోవడంతో గ్రామస్థులకు నర్సింగ్ బయటకు వెళ్లి రాలేదని విషయాన్ని తెలియజేసింది. దీంతో గ్రామస్థులు, బంధువులు పక్క గ్రామాల్లో ఉన్న తమకు తెలిసిన వారికి ఫోన్లు చేసి నర్సింగ్ వచ్చాడా.. లేదా అని ఆరా తీశారు. గత మూడు రోజులుగా అతని ఆచూకీ కోసం ప్రయత్నాలు చేసినా జాడ కానరాలేదు. చివరికి దొమినిపుట్టు గ్రామానికి చెందిన ఇద్దరు చిన్నారులు నర్సింగ్ మత్స్యగెడ్డలో నీట మునిగిపోయిన విషయం చూశామని 12వ తేదీ రాత్రి గ్రామస్థులకు తెలియజేశారు. భయంతో తమకు తెలిసినా చెప్పలేదని ఆ చిన్నారులు అన్నారు. నర్సింగ్ మత్స్యగెడ్డలో చేపల కోసం వల వేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు కాలు జారీ గెడ్డలో మునిగిపోయాడని, తాము చూశామని ఆ ఇద్దరు చిన్నారులు గ్రామస్థులకు చెప్పారు. దీంతో గల్లంతైన నర్సింగ్ కోసం స్థానికులు, మహిళా పోలీసు రాములమ్మ, వైసీపీ నేతలు దేవా, నీలకంఠం, రాజన్న, సిద్దేశ్, వీఆర్వో విజయలక్ష్మి నాటు పడవల సహాయంతో శనివారం మత్స్యగెడ్డలో విస్తృత గాలింపులు చేపట్టారు. ఫలితం మాత్రం కానరాలేదు.

తల్లిని కడతేర్చిన కేసులో కుమారుడి అరెస్టు

- 21 గ్రాముల బంగారం తాడు స్వాధీనం

నర్సీపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నాతవరం మండలం వైబీపట్నంలో తల్లిని హత్య చేసిన ఘటనలో కుమారుడిని శనివారం పోలీసులు అరెస్టు చేశారు. శనివారం నర్సీపట్నం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ పి.శ్రీనివాసరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. వైబీ పట్నం గ్రామానికి చెందిన చిటికెల రామ్మూర్తినాయుడు మద్యం తాగిన మైకంలో తల్లిదండ్రులు నిద్రిస్తున్న సమయంలో పెద్దగా కేకలు పెడుతూ ఇంటికి వచ్చాడని తెలిపారు. అరుపులకు నిద్ర లేచిన తండ్రిని తోసేసి తల్లి మెడలలోని బంగారం తాడు ఇవ్వకపోతే ఇద్దరిని చంపేస్తానని బెదిరించాడు. ఆభరణం ఇవ్వడానికి అంగీకరించకపోవడంతో తల్లి చిటికెల మంగ తలపై పూలకుండీతో కొట్టాడు. తర్వాత ఆమె మెడను కాళ్లతో తొక్కిపెట్టి బంగారం ఆభరణం లాక్కొని పరారయ్యాడని డీఎస్పీ తెలిపారు. తీవ్ర గాయాలతో మంగ అక్కడికక్కడే మరణించిందని తెలిపారు. శనివారం రూరల్ సీఐ రేవతమ్మ, నాతవరం పోలీసులు గన్నవరం మెట్ట వద్ద నిందితుడ్ని అరెస్టు చేసి 21 గ్రాముల బంగారం తాడు స్వాధీనం చేసుకున్నారన్నారు. ఈ సమావేశం సీఐ రేవతమ్మ, రూరల్ ఎస్ఐ రాజారావు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	132.00
లైవ్ ధర	152.00
విత్ స్కిన్	274.00
స్కిన్ లెస్	284.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559